డిసెంబర్ - 2024

# హన్నాకృప

ఆధ్యాత్మిక మాస పత్రిక

## విషయసూచిక


| | | |
|---|---|---|
| సంపాదకీయం | కె.ఇ. రాజేంద్ర | 02 |
| జప్పుత్వనేహు | కొడవటికంటి | 03 |
| నా చిత్తానుసారుడు | కొడవటికంటి | 06 |
| స్వార్థమే నా జీవితం | కె.ఇ. రాజేంద్ర | 08 |
| మధ్యకాలము | హన్నాకృప డెస్క్ | 9 |
| ఖుద్దూస్ | సాక్ష్యము | 10 |
| నీ సృష్టికర్త | హన్నాకృప డెస్క్ | 13 |
| క్రొత్తకోణాలు | అద్దంకి జాన్‌వెస్లీ | 14 |
| తార వెలసింది | డా॥ సుష్మ, నెల్లూరు | 17 |
| నన్ను పంపినవాని చిత్తము | కె.ఇ.రాజేంద్ర | 18 |
| క్రీస్తునక్షత్రం | హన్నాకృప డెస్క్ | 19 |
| యెహోవాయందు ... | స్త్రీల కొరకు | 20 |
| క్రిస్మస్ | చిన్నపిల్లల పేజి | 22 |
| బైబిల్ క్విజ్-12 | | 24 |



**సంపాదకులు :**

**కె. ఇమ్మానియేల్ రాజేంద్ర**
B.A.,B.L.,



**చందా వివరాలు :**
**సంవత్సర చందా రూ. 350/-**
పోషక చందా రూ. 1500/-
జీవితచందా రూ. 5000/-



**చిరునామా :**
ఎడిటర్, హన్నాకృప
పోస్ట్‌బాక్స్ నెం. 51 , క్లాపేట, 6వలైను
ఒంగోలు-523001, ప్రకాశంజిల్లా
సెల్ : 9440217726





సీరియల్ నంబరు


**బ్యాంకు అకౌంటు వివరాలు :**
A/c Name: **K. Emmanial Rajendra**
A/c No.: **10957294340**
Bank: SBI Main Branch, Ongole
IFSC Code : SBIN0000890

సంపాదకీయం....

# నిజ క్రిస్మస్

హన్నాకృప పాఠకులకు క్రిస్మస్ శుభాకాంక్షలు.

మన ఇంట్లో కుటుంబ సభ్యులలో ఎవరి పుట్టిన రోజు వచ్చినా, ఆ రోజంతా వారిని సంతోషపెట్టాలని వారికి ఇష్టమైనవన్నీ చేస్తాము కదా! వారితో పాటు మనం కూడా చాలా సంతోషిస్తాము. ఈ సంతోషమంతా మన కుటుంబానికే పరిమితమై ఉంటుంది. అయితే ఈ లోకరక్షకుడుగా మన పాపముల పరిహారార్థం యేసు ఈ లోకంలో జన్మించాడు. మనం నరకానికి వెళ్ళకుండా మనల్ని పరలోకము తీసుకొని వెళ్ళడానికి మన పాపముల నిమిత్తం సిలువలో మరణించి తిరిగి లేచాడు. యేసుక్రీస్తు రెండవసారి వచ్చి మనల్ని పరలోకరాజ్యానికి తీసుకెళ్తాడని మనందరికి తెలుసు. యేసుక్రీస్తు పుట్టి రెండువేల సంవత్సరాలకు పైగా గడిచిపోయాయి. క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం ఆయన పుట్టిన రోజును ఘనంగా జరుపుకుంటాము. అయితే యేసుక్రీస్తు పుట్టిన రోజైన క్రిస్మస్ రోజున మనం ఆయన కొరకు ఏం చేస్తున్నాము? ఆయనను ఎంతవరకు సంతోషపెడుతున్నాము? దేవునికి ఇష్టమైన పనులు చేయకుండా మనం మాత్రమే పండుగ చేసుకోవడం ఎంత వరకు సమంజసం. మనం అతిగా ప్రేమించే మన కుటుంబ సభ్యులు ఈ లోకంలో లేకపోయినా సరే, వారి జన్మదినమును పురస్కరించుకొని అనేక కార్యక్రమాలు చేస్తాము. అన్నదానాలని, రక్తదానాలని, పేదలకు బట్టలు ఇవ్వటంలాంటి కార్యక్రమాలు చాలామంది చేస్తారు. ఎందుకంటే వారిపట్ల చూపించే ప్రేమకు నిదర్శనంగా ఇవన్నీ చేస్తారు. మనం ఎంత ఖర్చు చేస్తున్నామన్న దానినిబట్టి వారి మీద మనకున్న ప్రేమని చూపిస్తాము. అయితే యేసు పుట్టిన రోజైన క్రిస్మస్ సందర్భంగా మనం ఇతరులకి ఏం చేస్తున్నామన్నదాన్నిబట్టి మనం యేసుని ఎంత ప్రేమిస్తున్నామో అర్థమవుతుంది. 'మిక్కిలి అల్పులైన ఈ నా సహోదరులలో ఒకనికి మీరు చేసితిరి గనుక నాకు చేసితిరని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను' (మత్తయి 25:35-40) అని చెప్పినట్లు మిక్కిలి అల్పులైన వారికి నీవు ఏమి చేసినా అది దేవునికి చేసినట్లే. మరి ఈ క్రిస్మస్ రోజున క్రొత్త బట్టలు ధరించి, ఇంటిని అలంకరించుకొని, పిండి వంటలు, బిరియానీలు చేసుకొని, బంధువులతో, స్నేహితులతో నీవు మాత్రమే సంతోషంగా ఉండా లనుకుంటున్నావా? యేసు పుట్టిన రోజున ఆయనను సంతోషపరచాలని అనుకుంటున్నావా? యేసును సంతోషపరచాలనుకుంటే పేదవారికి నీవు క్రొత్తబట్టలు ఇచ్చి, నువ్వు వండుకున్న బిరియాని పెడితే ఆయనకు చేసినట్లే. అది ఆయన మీద మనకున్న ప్రేమను నిర్ధారిస్తుంది. యేసు పుట్టిన రోజున ఆయనకు ఇష్టమైనవి చేసి ఆయనను సంతోషపెట్టినప్పుడు మాత్రమే అది నిజ క్రిస్మస్ అవుతుంది తప్ప నువ్వు కొత్తబట్టలు ధరించి, పిండివంటలు, బిరియానిలు తింటే కాదు. మరి ఈ క్రిస్మస్ రోజున నీవు యేసుని ఏ విధంగా సంతోష పరచాలనుకుంటున్నావు? యేసు చెప్పినట్లు మిక్కిలి అల్పులైన వారికి చేసి యేసును సంతోషపరచడానికి నీవు సిద్ధమా?

- కొడవటికంటి ఇమ్మానియేల్ రాజేంద్ర, ఎడిటర్

K. Emmanial Rajendra, SBI Main Branch, Ongole
**A/c No. 10957294340**

# జప్నత్పనేహు

**(యోసేపు జీవిత చరిత్ర)**

**– కొడవటికంటి**

అప్పటి వరకు ఊపిరి బిగబట్టి చెరసాల అధిపతి చెప్తున్నది వింటున్నాడు. క్షౌరముచేసే అతను క్షౌరము చేస్తున్నాడు. అధిపతి యోసేపును 'తమరు' అని అన్నప్పుడు యోసేపు ఉలిక్కిపడ్డాడు. అధిపతి తనను 'తమరు' అని ఎందుకు అన్నాడు? మహారాజు ఫరో తన కలభావం చెప్పించుకొని ఏదైనా పారితోషకము ఇచ్చి చెరసాల విముక్తి కలిగించ వచ్చును. అంత మాత్రమున ఒకఖైదీని ఈ అధికారి 'తమరు' అని ఎందుకు సంభోదించాడో అర్థంకాలేదు. తను కూర్చొని ఉన్న రీతినే చుట్టూ ఉన్న ఖైదీల గదులు అన్నీ ఒక్కొక్కటే పరికించి చూసాడు. ఎవరి గది వాకిలి దగ్గర వారు నిలబడి తనని భక్తి భావములతో చూస్తున్నారు. ఇంతలో ఒక సైనికుడు యోసేపును అధిపతి యొక్క గదిలోకి స్నానం చెయ్యమన్నట్లుగా చూపించాడు.

యోసేపు స్నానంచేస్తూ ఆలోచించాడు. నిజంగా దైవకార్యాలు మానవునికి అగోచరములు. తాను అనుకున్నట్లుగా, తాను ఆశించినట్లుగా రెండు సంవత్సరాల క్రితం పానదాయకుల అధిపతి కాని తనకిచ్చిన వాగ్దానం నిలుపుకొన్నట్లయితే పోతీఫరుకు అవమానము జరిగి యుండేది. అది తనకు కొంచెం కూడా ఇష్టములేనిది. తర్వాత తనకు ఫరో చెరసాల విడుదల ఇచ్చినట్లయితే, తనకి ఇష్టం వచ్చిన చోటుకి బ్రతుకు తెరువు కొరకు వెళ్ళిపోయి ఉండేవాడు. ఈ రోజు ఫరోకు కలవస్తే దానిభావం చెప్పగలవారెవరూ ఉండియుండే వారు కాదు. అదీకాక ఇంతకుముందు అయినట్లయితే, తన విన్నపం ప్రకారం ఫరో తనని విచారించేవాడు. కాని ఇప్పుడైతే ఫరో తనకు విన్నపము చేసుకోవలసి ఉంది. ఇది దేవుని కృప కాదా? కేవలం దేవుని కృపే!

స్నానం ముగించి బయటకు రాగానే ఫరో పంపించిన క్రొత్త బట్టలు, క్రొత్త చెప్పులు తొడిగినప్పుడు, యోసేపు అద్దంలో చూసుకుంటే ఎత్తు ఒక అడుగు పెరిగేనా? అనిపించినట్లుంది. పోతీఫరు ఇంట్లో ఇరవై నాలుగు గంటలు కష్టం చేసిన శరీరం, చెరసాలలో నీడ పట్టున కూర్చొనియున్నందున దాని ఇష్ట ప్రకారం, నిలువుగా, అడ్డముగా పెరిగిపోయింది. దేవుని ఆశీర్వాదం చెరసాలలోనే కాక తన శరీరం మీద కూడా ఉంది అనుకున్నాడు.

చెరసాలలో ప్రవేశించి దాదాపు ఐదు సంవత్సరాలు. తనకు ఎన్నోసార్లు బయట ప్రపంచం చూడాలనిపించింది. తను బయటకు కొంచెంసేపు వస్తే అడ్డగించేవారు లేరు. అయినా తను తన యజమాని చెరసాల అధిపతి కట్టడకు లోబడి యున్నాడు. ఆనాడు పదమూడు సంవత్సరాల క్రితం నాడే కొండ మీద నుండి హెబ్రోను కొండను చూసినప్పుడు తను శోధనను జయించాడు. ఈనాడు ఈ విధంగా తన శోధనను జయించి, ఫరో సమక్షమునకు వెళ్తున్నాడు. తన ఒక్కడికే ఒక రథం సిద్ధపరచబడి యున్నది. మిగిలిన వారందరికి ఒకరథం, తర్వాత రౌతులు గుర్రాల మీద వస్తుంటే, రాజమందిరమునకు అరగంటలో చేరుకున్నారు.

ఫరో యొక్క రాజనగరం పరలోకపు గవిని వలె ఉన్నది. రెండు ప్రక్కల ఆకాశమునంటే చెట్లు, భవనాలు, మొట్టమొదటిసారిగా చూడటం వలన ఏది ఎలా ఉందో చెప్పటం కష్టంగా ఉంది. మరలా తనను చెరసాలలోకి పంపించకుండా ఉంటే, ఈ కట్టడాలను నిదానించి చూడాలి అనుకున్నాడు. ఎడమ వైపున దూరంగా ఆకాశంలోకి దూసుకొని పోతున్న బాణం కొనలాగ చియోప్స్ పిరమిడ్ కొన కనబడుతుంది. దాని చుట్టూ మేఘం నిలిచి ఉంది. ఉదయకాలపు కిరణాలతో అది కట్టబడిన ఎర్రని రాళ్ళు ఇంకా ఎర్రగా ప్రకాశిస్తూ కనబడుతున్నాయి.

ఫరో రథంలో యోసేపు ప్రయాణం చేస్తుంటే, చంద్రునివలె ప్రకాశించే ఈ యౌవ్వనుడు ఎవరా? అని రాజప్రసాదంలోని భవంతులలో నుండి, మిద్దెల మీద నుండి జనం చూస్తున్నారు. అతని వాలకం చూస్తుంటే

రాజకుమారుడు కాదు. తలమీద ఏ కిరీటము కాని, పై వస్త్రము కాని ఏమి లేదు. ఫరో మహారాజు ఇంత పెందలకడ ఈ యువకుని ఎక్కడ నుండి పిలిపిస్తున్నారో ఎవరికి అర్థంకాలేదు. రాజు కాకుండానే రాజసం ఉట్టిపడుతున్న, కపటం ఎరుగని ఆ ముఖంలో అమాయకపు అందం, నొసట చిరు చెమటలు పట్టి సూర్య కిరణాల స్పర్శకు స్వేద బిందువులు నెత్తురు చుక్కల్లా మెరుస్తుండగా రథం దిగి ముందుకు నడిచాడు యోసేపు.

నాలుగైదు స్థంభాలు దాటి కుడివైపుకు తిరగగానే ఐగుప్తు మహాసామ్రాజ్యపు విద్వాంసులు, శకునగాండ్రు, వారి వారి శిష్యులు బారులు తీరి ఇరువైపులా ఆసీనులై యుండగా ఫరో తన ఉన్నత సింహాసనముపై అందరికంటే ఉన్నతంగా ఠీవిగా సింహాసనాసీనుడై యున్నాడు. వీరందరూ యోసేపు ఆగమనం కోసం ఎదురు చూస్తున్నవారే! ఇంకొక అరగంటలో రావచ్చును అనుకుంటున్న సమయంలో ముందుగానే సభాస్థలికి విచ్చేసిన యోసేపును చూచారు. అందరూ ఒక్కసారిగా ఎడమప్రక్కగా తిరిగారు. వీరందరూ యోసేపు కోసం ఎన్నో యుగాలనుండి ఎదురు చూస్తున్న ట్లున్నారు. కనుకనే కాబోలు యోసేపు కనిపించగానే అందరూ ఒక్కసారే లేచి నిలుచున్నారు.

యోసేపు వెంట వస్తున్నవారు బహు మర్యాదగా యోసేపును రాజు ఆసనముకు దగ్గరలో ఉన్న ఒక ఆసనం వరకు వెంటవచ్చి, 'ఇదే మీ ఆసనం ఇక మాకు సెలవు' అన్నట్లుగా యోసేపు వైపు చూచి రాజుగారికి నేలమట్టుకు వంగి నమస్కరించిన తర్వాత వెళ్లిపోయారు. యోసేపు వంగి చాలా మర్యాదగా రాజుగారికి నమస్కరించి నిలుచున్నాడు. ఇప్పుడు రాజుగారు, యోసేపు ఎదురెదురుగా ఉన్నారు. కానీ రాజుగారు నాలుగు మెట్లు పైన ఉన్న తన సింహాసనం ముందు నిలబడియున్నాడు. ఆయన యోసేపును చూసిన వెంటనే స్వాగతం చెపుతున్నట్లుగా ఒక్కొక్క మెట్టు దిగి యోసేపు దగ్గరకి వస్తున్నప్పుడు 'ఈ యౌవ్వనస్తుడు కల భావం చెప్పగలడు' అని అనుకున్నాడు. యోసేపు రాజు గారిని చూసినప్పుడు, చూస్తున్నప్పుడు ఆయనను ఫరోవలె గుర్తించలేదు. అనేక సంవత్సరాల క్రితం విడిపోయిన మిత్రునివలె యోసేపుకు కనిపించాడు. సహోదరునిలాగా కనిపించాడు. ఇటువంటి యౌవ్వనుడైన రాజులు అసలు ప్రపంచంలో ఉంటారా? అనుకున్నాడు.

ఫరో యోసేపుతో, "నేనొక కలకంటిని" అని ఆగి సభాసదుల వైపు చేయి చూపిస్తూ "దాని భావమును తెలుపగల వారెవరును లేరు" అని యోసేపు దగ్గరకు ఒక అడుగువేసి, ఏ రాజైనా ఎన్నడూ చేయని విధంగా యోసేపు భుజం మీద చెయ్యి వేశాడు. సభాసదులు అలలు కదిలినట్లు కదిలారు. "నీవు కలను విన్న యెడల దాని భావమును తెలుపగలవని నిన్నుగూర్చి వింటిని" అని పానదాయకుని వైపు చూపించాడు.

యోసేపు పానదాయకుని వైపు చూశాడు. పానదాయకుడు వంగి నమస్కారం చేశాడు. యోసేపు రాజు వైపు చూస్తూ, "అది నావలన కాదు" అని అనగానే, రాజు యోసేపు కళ్ళలోకి చూసాడు. "తొందరపడవద్దు మహారాజా, కొంచెం ఆగండి" అన్నాడు. రాజు వెనుతిరిగి మెట్లు ఎక్కి తన సింహాసనము మీద ఆసీనడయ్యి యోసేపును చూసి ఇక మాట్లాడు అన్నట్లుగా తన కుడిచెయ్యి ఊపాడు.

"దేవుడు ఫరోకు క్షేమకరమైన ఉత్తరమిచ్చును" అని అన్నాడు. ఫరో అతనిని కూర్చోమని సైగచేసాడు. ఫరో తన యొద్దనున్న ప్రతివారి వైపు చూస్తూ...

"నా కలలో నేను ఏటి ఒడ్డున నిలుచుంటిని" అంటూ మొదలు పెట్టి, యోసేపు వైపు చూస్తుంటే, యోసేపు ముఖం మారినట్లుగా చూసాడు. ఇదేమిటి? అనుకున్నాడు. ఇప్పుడు యోసేపు ముఖం ముందులా లేదు. అతని ముఖంతట్టు తనేకాదు సభలోని వారందరూ చూస్తున్నారు. యోసేపు ముఖం దేవదూత ముఖంలాగా ఉంది. అతను ఎవరితట్టూ చూడటంలేదు. అతి విశాలమైన, పొడవైన జీవనది, నైలును చూస్తున్న వానిలా అతని ముఖం కనబడుతుంది. ఎంతో ఎత్తులో అంటే మహోన్నతమైన పిరమిడ్ కంటే ఎత్తులో నిలబడి చూస్తున్నట్లుగా ఉంది.

"బలిసినవియు, చూపునకు అందమైనవియునైన ఏడు

ఆవులు ఏటిలో నుండి పైకివచ్చి, జమ్ములో మేయు చుండెను". యోసేపుకు అవి ఇప్పుడు స్పష్టంగా కనబడు తున్నాయి. ఏడు ఆవులు ఒక్కసారే నైలులో నుండి ఠీవిగా, అందంగా, ఆనందంగా పైకివచ్చి, పచ్చని జమ్ములో మేస్తున్నాయి. అదుగో... ఫరో ఆ ఎత్తు గట్టు మీదనున్న తన రథం మీద నుండి ఎంతసేపు చూస్తాడు? కళ్ళు అటు ఇటు తిప్పకుండా ఎంతో ఉల్లాసంగా వాటినే చూస్తున్నాడు.

"మరియు..." అని ఫరో ఆగాడు. అరే.... యోసేపు కూడా ఆ ఆవులను చూసినంత సంతోషంగా చూస్తున్నాడు అనుకొని, యోసేపు చూస్తున్న కలను భంగపరచ కూడ దన్నట్లు కొంచెంసేపు ఆగి ఇష్టం లేకపోయినా చెప్పక తప్పదన్నట్లుగా, "నీరసమైన బహు వికారరూపం కలిగి చిక్కిపోయిన మరి ఏడు ఆవులు..." ఔను అనుకున్నాడు యోసేపు. "ఒకదాని తర్వాత ఒకటి నీరసంగా నైలునదిలో నుండి పైకి వస్తున్నాయి." ఇక్కడ ఫరో రథం మీద లేడు. క్రిందకు దిగి ఉన్నాడు. ముఖం బహు వికారంగా ఉంది. అటు బలిసిన అందమైన ఆవుల వైపుగా చూస్తున్నాడు. ఈ చిక్కిపోయి వికారంగా ఉన్న ఆవులు బలిసిన ఆ మొదటి ఆవులను తింటున్నాయి. ఫరో ముఖం వైపు చూసాడు. ఇప్పుడు వికారమైన ఆవులు మాత్రమే ఆ జమ్ము దగ్గర ఉన్నవి. ఆ పచ్చని జమ్ము ఇప్పుడు పూర్తిగా వాడిపోయి ఉంది. బలిసిన ఆవులు వికారమైన ఆవుల కడుపులో పడినప్పటికి అవి అలా కనబడలేదు. ఇంకా వికారంగా బలహీనంగానే ఉన్నాయి. ఫరో ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

దర్బారులో ఒక్క మనిషి కూడా లేనంత నిశ్శబ్దంగా ఉంది. యోసేపు కలనుండి మేలుకొనిన వానివలె రాజువైపు చూచి, సభవైపు చూశాడు. "అంతలో నేను మేలుకొంటిని" అని రాజు యోసేపు వైపు చూసాడు. ఇప్పుడు యోసేపు ముఖం మొదట సభకు వచ్చినప్పటివలె ఉంది.

"మరియు నా కలలో నేను చూడగా పుష్టిగల ఏడు మంచి వెన్నులు ఒక్కదంటున పుట్టెను. మరియు తూర్పు గాలిచేత చెడిపోయి యెండిన యేడు పీలవెన్నులు వాటి తరువాత మొలిచెను. ఈ పీల వెన్నులు ఆ మంచి వెన్నులను మ్రింగివేసెను" రాజు చెప్పటం ఆపి, ప్రజల వైపు చూచాడు. యోసేపు కూడా అటు చూచాడు. "ఈ కలను జ్ఞానులకు తెలియచెప్పితిని గాని దాని భావమును తెలుపగల వారెవరును లేరు." జ్ఞానులకు తెలియచెప్పితిని అని అనినప్పుడు సభలో మరలా కదలిక మొదలై అక్కడక్కడ మాట్లాడుకోవటం మొదలుపెట్టారు. భావమును తెలుపగల వారెవరును లేరు అన్న తర్వాత సభకు జీవం వచ్చినట్లుగా ఉంది. అందరూ యోసేపు వైపు చూస్తున్నారు.

యోసేపు సభ వైపు, పానదాయకుని వైపు చూసాడు. పానదాయకుడు సిగ్గుతో తలవంచుకున్నాడు. యోసేపు లేచి నిలబడి ఫరో యొద్దకు రెండడుగులు వేసి, తలవంచి నమస్కరించాడు. ఇప్పుడు యోసేపు కలభావం చెప్పబోతున్నాడు. సభలో నిశ్శబ్దం తాండవిస్తుంది.

**(సశేషం)**


**ఫోన్‌పే ద్వారా లేదా గూగుల్ పే ద్వారా**
**చందా పంపించాలంటే**
**ఈ క్రింది క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి**

Scan & Pay Using PhonePe App

Emmanial Rajendra

సీరియల్



# నా చిత్తానుసారుడు

(దావీదు జీవిత చరిత్ర)

- కొడవటికంటి

అయిదుగురు పెద్దవయసున్న వారిని తీసుకొని కర్మేలు వెళ్ళాడు. అబీగయీలు వారిని చూచి హనానును పిలిచి వారికి విందు చేయించింది. మధ్యాహ్నం భోజనమైన తర్వాత "దావీదు మమ్ములను పిలిచి, నిన్ను పెండ్లి చేసికొనుటకై తోడుకొని రండని పంపియున్నాడు" అన్నాడు షమ్మా. ఆమె లేచి షమ్మా ఎదుట సాగిలపడి "నా యేలినవాని చిత్తము. నా యేలినవాని సేవకుల కాళ్ళు కడుగుటకు నా యేలినవాని దాసురాలనగు నేను సిద్దంగా ఉన్నాను" అని అంది అబీగయీలు.

హనాను ఆ యింటి పెద్ద సేవకురాలిని పిలిచి సంగతంతా వివరించి చెప్పాడు. వెంటనే ఆమె అయిదుగురు అర్హులైన సేవకురాండ్రులను అబీగయీలుతో వెళ్ళుటకు ఏర్పాటు చేసింది. అబీగయీలునకు కావలసిన దుస్తులు ఇతర సామాగ్రి గాడిదల మీద చేర్చారు.

అబీగయీలు తన గాడిద మీద ఎక్కితే పనికత్తెలు ఆమె వెనుక నడుస్తుంటే యెజ్రెయేలునకు బయలుదేరినది.

అహీనోయము తండ్రి యెజెరు ఊరి గవిని యొద్ద అబీగయీలును కలుసుకొని తన ఇంటికి తీసుకొని వచ్చాడు. తర్వాత తొమ్మిది నెలలకే అబీగయీలు మగపిల్లవాడ్ని ప్రసవించింది. ఈ బిడ్డ నాబాలు వలననా లేక తన సంతానమా? అన్న అనుమానం కలిగింది దావీదుకి. అందుకని అతనికి కిల్యాబు అని పేరుపెట్టాడు.

ఇప్పుడు తనకు దాదాపు ఇరవైయేడు సంవత్సరాలు నిండుతున్నాయి. సమూయేలు అభిషేకం దాదాపు తన స్మృతి పథంలో మాసిపోతుంది. తాను ఇద్దరి బిడ్డల తండ్రి. ఇప్పుడు ఆస్తిపరుడయ్యాడు. సౌలుకి దాదాపు డెబ్బది సంవత్సరముల వయస్సు వస్తుంది. బహుశా ఆయన ఎక్కువకాలం జీవించక పోవచ్చును. తన ప్రాణస్నేహితుడు యోనాతానుకు పట్టాభిషేకం చేయవచ్చును.

అలా జరిగితే తాను ఇశ్రాయేలీయులకు రాజు అయ్యే ప్రశ్నేలేదు. అదీకాక సౌలు ఇప్పుడు తనను వెంటాడటం లేదు. కొన్ని రోజులు ఆగి తన తల్లిదండ్రులను మోయాబు దేశం నుండి తీసుకొని రావాలి అని అనుకున్నాడు.

ఒకరోజు అహీమెలెకు మరికొందరు అనుచరులతో కలసి జీఫు అరణ్యంలో పండించుచున్న యవలచేను చూడటానికి వెళ్ళి అక్కడనే మిగిలిన పనులు చూసుకుంటూ ఒక వారం అక్కడ తాను ఇంతకు ముందు నివశించిన చోట ఉన్నాడు.

నెతనేలు గుఱ్ఱం మీద వచ్చి "సౌలు మూడు వేల మందిని ఏర్పరచుకొని మిమ్ములను పట్టుకొన బయలు దేరుచున్నాడని యోనాతాను వర్తమానం పంపియున్నాడు. మీరు జీఫు అరణ్యంలో యోషిమోను ఎదుట హకీలా మన్యములో దాగియున్నారని జీఫీయులు గిబియాకి వెళ్ళి సౌలుని రెచ్చ గొట్టారంట" అన్నాడు.

సౌలుతో యుద్ధం చెయ్యటం సమ్మతం కాదు. నెతనేలుతో మన వేగుల వారిని పంపి సౌలు సైన్యంతో విడిది ఎక్కడ చేస్తాడో గమనించి నాకు వర్తమానం తీసుకొని రమ్మన్నాడు. నెతనెలు వెళ్ళిపోయిన తర్వాత అబీషై ప్రక్కన కూర్చున్నాడు. "అదేమిటి దిగులుగా ఉన్నావు" అన్నాడు అబీషై.

"నా విషయం నాకు దిగులు లేదు. మన యోధుల విషయం కూడా దిగులు లేదు. కాని యూదయ అరణ్యంలో నివశించే నా జాతి వారే నాకు శత్రువులెందుకు అయ్యారు? ఈ ఇశ్రాయేలు దేశములో మనం నివసిస్తే ఎప్పటికైనా మన భార్యబిడ్డలు సౌలు చేతికి చిక్కిపోతారు. కనుక అన్యుల దేశంలో తల దాచుకోవటం మంచిది అనిపిస్తుంది" అన్నాడు. "నిజమే కాని మీరన్నట్లు అది దేవుని చిత్తమా?" అన్నాడు అబీషై. "సమూయేలు మరణించిన తరువాత

ఇశ్రాయేలులో దేవుని చిత్తం విషయం ఆలోచించే వారెవరు?" అన్నాడు దావీదు.

సాయంకాలం నెతనేలువచ్చి "హకీలా మన్యమందు త్రోవ ప్రక్కన సౌలు దండు దిగి యున్నది" అని చెప్పాడు.

"నీవు యెజ్రెయేలు, కర్మేలు, మాయోనులలో కాపురమున్న మన వారందరికి ఈ సంగతి తెలియజెప్పి వారి పశువులను పిల్లలను సామాను సర్దుకొని ప్రయాణమునకు సిద్ధంగా ఉండమని చెప్పు. నేను రేపు వచ్చి మనం ఎక్కడికి వెళ్లవలసినది చెబుతాను" అన్నాడు దావీదు.

నెతనేలు వెళ్ళిపోయిన తర్వాత దావీదు అహీమెలెకు, అబీషైతో బయలుదేరాడు. "సౌలు సైన్యం మూడు గుంపులుగా మూడు ప్రదేశాలలో విడిది చేసారు. సౌలు ఏ గుంపులో ఉన్నాడో చూడాలి" అన్నాడు. చివరకి క్రొత్త దండులో చూశారు.

"పాళెములోనికి సౌలు దగ్గరకి నాతో కూడా ఎవరు వస్తారు?" అన్నాడు దావీదు. అహీమెలెకు కొంచెం భయంగా చూసాడు. "నీతో కూడా నేను వస్తాను" అన్నాడు అబీషై.

ఇద్దరూ కలసి కొండకి ఎడమవైపుగా చెట్ల గుబురుల మధ్యలో కూర్చుని అలాగే క్రిందకు దిగుతున్నారు. పైన చందమామ నిండుగా ఉన్నాడు. సౌలు దండులో మధ్యన ఒక బండమీద కూర్చున్నాడు అతని ప్రక్కన అబ్నేరు నిలుచున్నాడు. భోజనం చేస్తునట్లుగా కనిపిస్తుంది. ఒక గంట తర్వాత ఎత్తులేని మంచం వంటిది వేసి దాని మీద దుప్పటి పరచి దిండు వేశారు. ఆ ప్రక్కనే నేల శుభ్రం చేసి అబ్నేరుకు పడక వేశారు.

నలుగురు సైనికులు నాలుగు మూలలలో పహారాకి పెట్టి జాముల ప్రకారము వంతు వేస్తున్నాడు అబ్నేరు. సౌలు తన పడక దగ్గరకి వచ్చి తన చేతిలోని ఈటె తన తలగడ దగ్గరగా నేలలోకి నాటాడు. ఒక సైనికుడు నీళ్ళబుడ్డిని సౌలు తల గడ దగ్గరగా పెట్టి వెళ్ళి పోయాడు. సౌలు పడక మీద పండుకొని పైకి ఎక్కుతున్న చందమామని చూస్తున్నాడు. అబ్నేరు ప్రక్కన బండమీద కూర్చున్నాడు.

రాజు చుట్టు సైనికులు వారు పండుకొనేందుకు వీలుగా అక్కడ శుభ్రం చేసుకుంటున్నారు. రాజు నిద్రపోవడం కోసం ఎదురు చూస్తున్నారు. అరగంట తర్వాత సౌలురాజు నిద్ర పోతున్నట్లు గమనించిన అబ్నేరు తన పడకమీద తల వాల్చాడు. సైనికులు కూడా తలవాల్చారు.

నాలుగు మూలలుగా నిల్చున్న పహారా సైనికులు అటు ఇటు తిరుగుచున్నారు. ఒక గంట తర్వాత చందమామ ఆకాశం మధ్యలో ఉన్నాడు. దావీదు అబీషై అలాగే కూర్చుని దండు వైపుగా వస్తున్నారు.

అబీషై దావీదు చెయ్యి పట్టుకున్నాడు. అటువైపుగా చూడమన్నాడు. పహారా కాచే నలుగురు కూర్చుని నిద్రపోతున్నారు. సాధారణంగా నిలబడి కావలి కాచేవారు నిద్రవస్తే తర్వాత పహారా కాచేవాళ్ళని లేపి నిద్రపోతుంటారు. అటువంటిది నలుగురు ఒక్కసారే ఎలా నిద్రపోతున్నారో అర్థం కాలేదు.

అబీషై దావీదుతో "దేవుడు ఈ దినమున నీ శత్రువును నీ చేతికి అప్పగించెను. కాబట్టి నీ చిత్తమైతే ఆ ఈటెతో ఒక్కపోటు పొడిచి, నేనతనిని భూమికి నాటి వేతును. ఒక్కదెబ్బతోనే పరిష్కారం చేతును" అన్నాడు లేచి నిలబడి.


దావీదు అబీషై చెయ్యిపట్టుకుని క్రిందకి లాగి కూర్చోబెట్టి "నీవతని చంపకూడదు. యెహోవా చేత అభిషేకంనొందిన వానిని చంపి నిర్దోషి అగుట ఎవనికి సాధ్యం. యెహోవా జీవముతోడు యెహోవాయే అతనిని మొత్తును. అతడు అపాయము వలన చచ్చును. లేదా యుద్ధమునకు పోయి నశించును" అన్నాడు దావీదు.

అబీషైకి ఆదుల్లాము గుహలోని అనుభవం గుర్తుంది.

"ఈనాడు సౌలును చంపే తరుణం కంటే ఆదుల్లాము గుహలో చాలా తేలికగా జరిగియుండేది. యెహోవా చేత అభిషేకమునొందిన వానిని నేను చంపను. ఆలాగున చేయకుండా యెహోవా నన్ను ఆపును గాక" అని లేచి నిలబడి "అతని తలగడ దగ్గరనున్న యీటెను నీళ్ళబుడ్డిని తీసుకొని మనం వెళ్ళిపోదాం రా" అని అబీషైతో చెప్పి చిన్నగా నడుస్తూ సౌలును సమీపించి అతని ఈటెను నేలలో నుండి లాగి పట్టుకున్నాడు. **(సశేషం)**



# 'స్వార్థమే నా జీవితం'




'నేను' 'నాది' 'నా' ఇవన్నీ స్వార్థంతో కూడుకున్నవే. ఈ సృష్టిలో జీవించే ప్రాణులలో కేవలం మనుష్యులలో మాత్రమే స్వార్థము అనేది చెల్లుబాటు అవుతుంది. 'నేను' బాగుండాలి, 'నాకు' అన్నీ జరిగిపోవాలి, 'నాది' నాకు ఉండాలి అని ఇలా 'నా' అనేది మనిషిని చచ్చేదాకా వదిలిపెట్టదు. 'నా' అనే పరిధిలో ప్రాధాన్యత క్రమం 'నేను'తో ప్రారంభమై, నా భార్య, నా బిడ్డలు, నా తల్లిదండ్రులు, నా బంధువులు, నా స్నేహితులుగా ఉంటుంది. ఎవరికి వాళ్ళు నిర్ణయించుకున్న పరిధినిబట్టి వారి స్వార్థము ఉంటుంది. ఆ పరిధి తన వరకే ఉంటే కన్నబిడ్డలనైనా, కట్టుకున్న భార్యనైనా పట్టించుకోరు. ఆ పరిధిలో తన కుటుంబం వరకే అంటే తను, తన భార్యా బిడ్డలు మాత్రం ఉంటే, ఇంక తల్లిదండ్రులను, అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళను పట్టించుకోరు. ఇలా తమ పరిధిని ఎంత వరకు విస్తరించుకుంటారో అంత వరకే వారి ప్రపంచం ఉంటుంది తప్ప మిగతా వారి గురించి పట్టించుకోరు. ప్రపంచంలో 99.99% మంది ఇలానే ఉంటారు. ఎక్కడో నూటికో కోటికో ఒక్కరో ఇద్దరో వారి ప్రపంచానికి పరిధి పెట్టుకోకుండా ఇతరుల కోసం జీవిస్తుంటారు. మదర్ తెరిసా జీవితం ఇందుకు చక్కని ఉదాహరణ. ఆమె తన యుక్త వయస్సులోనే తన జీవితాన్ని దేవుని సేవకి సమర్పించుకొని చనిపోయే వరకు కూడా ఎంతోమంది అభాగ్యుల జీవితాలలో వెలుగులు నింపడానికి అహర్నిశలు కష్టపడింది. ఆమె మనందరిలా మనిషిగానే పుట్టింది. ఆమె కూడా గొప్ప గొప్ప చదువులు చదివి, మంచి ఉద్యోగం సంపాదించి, ఒక అందమైన వ్యక్తిని పెళ్ళి చేసుకొని, బాగా డబ్బు సంపాదించి, విలాసవంతమైన జీవితం జీవించవచ్చు. ఎవరైనా అలాంటి జీవితాన్నే కదా కోరుకుంటారు. మరి ఆమెకి ఏం ఖర్మపట్టి తన తల్లిదండ్రులను, బంధువులను, దేశాన్ని వదిలి అన్యుల కోసం సేవ చేసింది? మనమైతే అలా చేయగలమా? 'అమ్మో, ఇంత విలువైన జీవితాన్ని అన్యుల కోసం త్యాగం చేయడమా, నెవ్వర్' అంటాము కదా! నేను బాగుంటే చాలు అనుకోవడమే కదా స్వార్థపరుల లక్షణం. ఇంకా విచిత్రం ఏంటంటే, జీవితం మీద విరక్తి చెంది ఆత్మహత్యలు చేసుకొనే వారు చావనన్నా చస్తారు కానీ, 'చచ్చి సాధించేదేముందిలే, పదిమందికి సేవచేసి చస్తే పుణ్యమైనా దక్కుతుంది' అన్న ఆలోచన మాత్రం వారికి రాదు. ఈ శరీరం నాది బతికితే నా కోసమే బతుకుతాను, లేదంటే చస్తాను అనుకొని చావడంలో కూడా స్వార్థమే చూపిస్తారు. ఇలాంటి స్వార్థపరమైన జీవితం జీవించేవాళ్ళు 'నిన్నువలె నీ పొరుగువానిని ప్రేమించు' అని దేవుడు చెప్పిన దానిని అస్సలు నెరవేర్చలేరు. "మనుష్యులు మీకు ఏమి చేయవలెనని మీరు కోరుదురో ఆలాగుననే మీరును వారికి చేయుడి" (మత్తయి 7:12) అన్న వాక్యం ఇలాంటి వారికి వర్తించదు. మత్తయి 19:16–22లో నిత్యజీవమునకు వారదనగుటకు నేనేమి చేయాలి అని ఒకడు యేసుని అడిగినప్పుడు 'ఆజ్ఞలను పాటించమని యేసు చెప్తాడు. 'నేను చిన్నప్పటి నుండి పాటిస్తున్నానని అతడు చెప్తాడు, అప్పుడు యేసు 'పోయి నీ ఆస్తిని అమ్మి బీదలకు ఇవ్వమని' అతనితో చెప్పినప్పుడు అతనికి ఉన్న ఆస్తినిబట్టి అతడు వ్యసనపడుతూ వెళ్ళిపోతాడు. అతనిలో ఉన్న స్వార్థం యేసు చెప్పిన మాట విననీయకుండా చేసింది. అందుకే అతడు నిత్యజీవమునకు వారసుడు కాలేకపోయాడు. మనలో ఉన్న స్వార్థం మనల్ని దేవుని నుండి దూరం చేస్తుంది. **'స్వార్థమే నా జీవితం'** అన్నట్లు జీవించే వారు ఎవరినీ ప్రేమించలేరు, ఎవరితోను ప్రేమింపబడరు.

**ఫోన్‌పే లేదా గూగుల్ పే ద్వారా పత్రిక చందా పంపవలసిన ఫోన్ నంబరు**

**9 4 4 0 2 1 7 7 2 6**

# మధ్యకాలము

నికనార్ యూదా యొక్క బలశౌర్యములు తెలిసినవాడై అతనితో సంధిచేసుకొనుటకు కబురుపెట్టెను. కాని అల్సియస్ మాత్రము యుద్ధము వలన తనకు లాభమని తలచి రాజ్యము కొట్టెను. అందువలన మొదటి ఆజ్ఞను నికనార్ నిరాకరించి పలుయుద్ధములలో విజయము సాధించుచూ బోతొరాన్ అను గ్రామసమీపంలో యుద్ధం జరుగుచుండగా నికనార్ చంప బడెను. మరియు అతని 35,000 మంది సైన్యము కూడా ఆయుధములు క్రిందపడవేసిరి. ఈ విజయమును ప్రతి సం॥ము కృతజ్ఞతారాధనతో హార్షిక దినముగా జరుపుకొనిరి.

సిరియనులు రాజద్రోహముల గురించి ఏ మాత్రము శ్రద్ధ వహించకపోవుట గమనించెను. రోమీయులతో సంబంధం ఏర్పరచుకొనినచో దేశం, ద్రోహుల నుండి సురక్షితంగా ఉండగలదని ఊహించెను. గనుక జాసన్ మరియు యుపొ లేమెయాస్ అనువారిని రోమా పట్టణమునకు పంపగా వారి రువురి మధ్య శాంతి సమాధానములను సంధిని వెంటనే రోమీయులు అనుమతించి పంపిరి. దెమెత్రియస్ యుద్ధం చేయకుండా ఆగినందుకు అతడు యూదులకు ఎలాంటి కష్టంగాని, సమస్యలుకాని ఇవ్వకూడదని జారీచేయబడిన ఉత్తరమును కూడా దెమెత్రియస్‌కు అందజేసిరి.

ఏది ఏమైనా ఇదంతా క్రియచేయలేదు. కొంతకాలమైన తర్వాత ఈ సంధి తప్పిపోవుచుండగా దెమెత్రియస్ నికనార్ మరణమునకు, ఓటమికి ప్రతీకారం తీర్చుకొనుటకై అనేక మంది సైనికులతో బక్కియాస్, అల్సియస్‌లను యూదయపై దండయాత్రకు పంపెను. ఈ సమయంలో వారిని ఎదుర్కొను టకు యూదాకు 3,000 మంది సైన్యము కంటే ఎక్కువమంది లేకపోయిరి. వారియొక్క శత్రువుల బలసంఖ్య తెలిసికొని వారిలో 800 మందిని వారి సంస్థానమున విడిచివెళ్ళిరి. అయినను దేవుని చిత్తమునకు లోబడుటకు నిరాకరించెను.

ఆ ధైర్యశాలులతో కలసి బక్కయాస్ తానే స్వయంగా ఏర్పరచిన కుడిరెక్కను విరుగగొట్టెను. అజోతాస్ పర్వతము వరకు వారని తరిమివేసెను. ఈ చిన్న సైన్యము ఎడమ కిటికీ ద్వారా వారిని వెంబడించి ముట్టడి వేయకుండినట్లయితే వారు పూర్తి విజయము సాధించియుండెడివారు. గొప్పబలమైన సైన్యంతో ముట్టడి వేయబడి వారి ప్రాణములను ఎక్కువ ఖరీదునకు అమ్ముకొనిరి. యూదా చంపబడెను మరియు అతనిని రక్షించవలెననుకొనిన వారు పారిపోయిరి.

యూదా మృతదేహము సీమోను, యోనాతాను అను వాని సహోదరులచే వారి పూర్వీకుల సమాధుల యొద్ద "మోదిన్" లో సమాధి చేయబడెను. అతడు కోరుకొనిన విధముగానే గౌరవనీయమైన అంత్యక్రియలు జరిగింపబడెను. బక్కిదెస్ అతని తర్వాత పూర్తి దేశాన్ని ముట్టడి వేసి మక్కబీయుల సహాయులందరిని క్రూరముగా వాడుకొనెను. యోనాతాను దేశపు పెద్దగా విరమించుకొని విసుగుచెంది తెకోవా అరణ్యం లోనికి పోగా ఈ చిన్నసైన్యం ఒకప్రక్క తడినేలను, రెండవప్రక్క యోర్దాను నదిని ముట్టడివేసిరి. బక్కిదేస్ వారిని వెంటాడి వారు ముట్టడి వేయు స్థలము చుట్టూ భద్రతా దళమును ఉంచి దాని ద్వారా సబ్బాతు దినమందు ఎదుర్కొనిరి.

ఈ సమయమున క్రీ.పూ. 160లో అల్సియస్ అను క్రూరమైన మతగురువు పక్షవాతముతో మరణించెను. థెమెత్రియస్ రోమా మతనాయకుల నుండి యూదులను హింసించుట మానమని ఆజ్ఞాపించిన ఉత్తరమును అందు కొనెను. మరియు బక్కిదేస్‌ను తిరిగి వెనుకకు పిలిపించిరి. అందువలన యోనాతాను తన కార్యములను తిరిగి క్రమముగా చేయగల్గిన పరిస్థితిని కనుగొనెను. కాని ఈ నెమ్మది కల్గిన స్థితి రెండు సంవత్సరముల వరకే ఉండెను. ఏలయనగా మాలొబనీయులు బక్కిదెస్సు అతని సైన్యముతో తిరిగి రమ్మని అతడు చేయుచున్న సాహసయాత్రకు వారు సహాయపడునట్లు, యోనాతానును మాత్రము ముట్టడి వేయవలెనన్న షరతుతో ఆహ్వానించిరి.

**(సశేషం)**

సాక్ష్యము

# ఖుద్దూస్

పాపికి రక్షణ ఏ ధనము ఇవ్వదు, ఏ మనుష్యుడు ఇవ్వలేడు. "మనుష్యులను నమ్ముకొనుట కంటే యెహోవాను ఆశ్రయించుట మేలు, రాజులను నమ్ముకొనుట కంటే యెహోవాను ఆశ్రయించుట మేలు" కీర్తనలు 118:8,9 "రాజులచేతనైనను, నరులచేతనైనను రక్షణ కలుగదు వారిని నమ్ముకొనకుడి" కీర్త.146:8 "ఎవడును ఏ విధము చేత నైనను తన సహోదరుని విమోచింపలేడు" కీర్తనలు 49:7.

ఇది సత్యము ప్రియులారా మనకు రక్షకుడు, విమోచకుడు ఆ సర్వేశ్వరుడైన యేసుక్రీస్తు మాత్రమే. నా ఈ ధృఢ నిశ్చయతకు నా తండ్రి అగ్రహము చెంది తుపాకి నా గొంతుకు ఆనించి, యేసును మరచిపో లేదా చంపేస్తాను నీలాంటి వెధవ ఉన్న ఒకటే లేకపోయిన ఒకటే అన్నారు. నేను చనిపోవుటకు సిద్ధపడ్డాను, ఎందుకంటే మరణమంటే భయము లేదు, నా రక్షకుడు సజీవుడు తప్పక ఆయన నన్ను కాపాడుతాడు. ఇది నా విశ్వాసము. అపొ॥ పౌలుగారి విశ్వాసము నన్ను ధైర్యపరచినది "బ్రతుకుట క్రీస్తే చావైతే నాకు లాభము" ఫిలిప్పి 1:21, చూడండి దేవుని కార్యములు ఎంత అద్భుతముగా జరుగునో మనము ఊహించలేము. వెంటనే మా చిన్నాయనగారు మా తండ్రిగారిని సమీపించి నీవు ఏమి చేస్తున్నావో నీకు తెలుసా! వాడిని చంపగలవు గాని వాడిని మార్చలేవు, వానిని చంపి ఎందుకు జైలుకు పోతావు. వానిని విడచిపెట్టు కొంతకాలానికి సత్యమేదో తెలుసుకొని వస్తాడు. ఒకవేళ వాడు నమ్మినదే సత్యమైతే మనం కూడ ఆ దారిన నడువ వలసివస్తుందేమో అన్నాడు. అప్పటికిగాని సాతాను కుయుక్తులను ప్రభువు సహాయముతో జయించగలిగినాను. నా తల్లి, తండ్రి, బంధువులు ఇక ఎలాంటి నిర్బంధము పెట్టకుండ శాపవచనముల కుంభ వర్షముగా కురిపించి నన్ను విడిచిపెట్టిరి. దేవునికి స్తోత్రములు, నెల్లూరులోని నా ఆత్మీయ తల్లితండ్రుల వద్దకు చేరుకొని కొంతకాలం, ప్రభుత్వ ఉద్యోగములో చేరి కావలిలో కొంతకాలము గడిపితిని. బాప్తిస్మమునకు ముందు నాలుగు సంవత్సరములు మందిరమునకు వెళ్ళుచు ఆరాధనలలో పాల్గొనుచు విశ్వాసిగా జీవించితిని. నా ఆత్మీయ తండ్రి రాజమన్నార్‌గారు అంత త్వరగా బాప్తిస్మము ఇప్పించుటకు ఇష్టపడలేదు. ఆర్థికముగా నాకు నేనే బలపడాలని కోరినారు. అందుకని ప్రతిరోజు సినిమా వాల్‌పోస్టర్ల బండ్లు నెట్టుచు నాపొట్ట గడుపుకొనెవాడను.

కొంతకాలమైన తర్వాత రాజమన్నారుగారు దానమ్మ గారు దయతలచి వారి కుటుంబములో ఒక్కరిగా చేర్చుకొని ఆహారము ఇచ్చేవారు. నేను యస్.యస్.యల్.సి. పరీక్షలు వ్రాసినాను, విజయము ప్రాప్తించలేదు. 1960 లో ఏప్రిల్ నెలలో నా మకాము కావలికి మార్చినాను. రాజమన్నారు గారి బంధువైన వై.యస్. తీయోఫర్ గారు వారి సతీమణి జీవమ్మగారు నన్ను ఎంతగానో అభిమానించి నా క్రైస్తవ విశ్వాసమును గమనించి, కావలి పట్టణ తెలుగు బాప్టిస్టు సంఘంలో 18-4-1960 ఈస్టరు పండుగ సమయంలో బాప్తిస్మము ఇప్పించిరి. ఆనాటి సంఘకాపరి గారు రెవ.సాలి దేవదాస్‌గారు. సంఘమంత సంతోష గానాలతో ప్రభువును స్తుతించిరి, ఘనపరిచి మహిమపరచిరి, ఎందుకనగా ఒక మహమ్మదీయుడు ప్రభువును విశ్వసించి మారుమనస్సు పొంది బాప్తిస్మము పొందుట అది దేవుని చిత్తమనిరి. తియోఫర్‌గారి సహకారములతో రెవెన్యూ ఆఫీసులో అటెండరుగా రెండు నెలలు మే, జూన్ మాసములు చేసినాను. దేవుని పిలుపు కలిగి జులై మాసం 18వ తేదిన కావలికి అతి చేరువలో నున్న రామాయపట్నం బంగాళ ఖాతము ఒడ్డున 2 కి.మీ దూరములోను జి.టి. రోడ్డుకు తెట్టు నుండి 5 కి.మీ లో 111 ఎకరముల విస్తీర్ణముగల పరిశుద్ధ స్థలమును పూర్వ మిషనెరి తల్లితండ్రులు

ప్రార్థనలతో ఈ పరిశుద్ధ స్థలమును ఏర్పాటు చేసి సంఘ కాపరుల తర్ఫీదు ఇచ్చుటకు వేదాంత కళాశాలను 1874 సం॥లో స్థాపించిరి. నేను 1960-61 లో సెమినెరి విద్యను ముగించి 1961 నుండి సెమినెరిలోనే సెమినెరి సూపర్ వైజరుగా పనిచేస్తున్న కె. జోసఫ్‌గారి వద్ద అసిస్టెంట్ సూపర్ వైజరుగా సెమినెరి అధ్యక్షులు డా॥ యం. బ్లాంచర్డుగారు నియమించిరి. నేను సెమినెరి చదువుతున్నప్పుడు బ్లాంచర్డ్ గారు నా విశ్వాస్యత, నా ప్రవర్తన, నా మంచి తనమును గుర్తించి భారమైన బాధ్యత నాకు అప్పగించిరి. జోసఫ్‌గారికి నేను కృతజ్ఞతలు తెలుపుకొనుట నాకు ఆశీర్వాదము, ఎందుకంటే తన కుమారుల కంటే నన్ను ప్రేమించి, అభిమానించి తన తర్వాత ఆ పనిలో నియమించబడు తున్నానని తెలుసుకొని మంచి మనస్సుతో సెమినెరిలోని తాను చేస్తున్న పనులన్నీ నేర్పించిన మహనీయుడు.

**సెమినెరిలోని నా జీవితము :**

సెమినెరి విద్య ముగించిన తర్వాత సెమినెరి అధ్యక్షులు గౌరవనీయులు డా॥ బ్లాంచర్డుగారు నన్ను సెమినెరిలో అసిస్టెంటు సూపర్‌వైజరుగా 1961 ఏప్రిల్ 18న నియమించినారు. మరల 1963 జనవరి నుండి పూర్తి బాధ్యతలతో సూపర్‌వైజరుగా పనిచేయుట ఆయన చిత్తము. బహుశ మరల నా పాత జీవితమునకు పోకుండ సెమినెరి పరిశుద్ధుల సహవాసములో యుండి, ప్రభువు నందలి నా విశ్వాస జీవితమును కాపాడుకొనుచున్నాను.

నరుడు ఒంటరిగా యుండుట మంచిదికాదని దేవుడు పలికిన ఆ పలుకులనుబట్టి నా జీవితములో 1964 ఏప్రిల్ 18వ తేదిన సెమినెరిలోనే వివాహము జరిగినది. ఆ రోజున వివాహమునకు 10 మంది మిషనరీలు వచ్చి మమ్ములను ఆశీర్వదించుట సత్యదేవుని ఏర్పాటైయుండినది. ఇది దేవుని నిర్ణయము ఆయన ఏర్పాటు ప్రకారము డా॥ బ్లాంచర్డు దంపతులు, నా ఆత్మీయ తల్లిదండ్రులు రాజమన్నార్ దంపతులు, శ్రీ వై.యస్. తియోఫర్‌గారి దంపతుల సమ్మేళనములో సెమినెరి విద్యలో నాతో చదివిన ఒంగోలు వాస్తవ్యులు శ్రీ అద్దంకి కృపయ్య గ్రేసమ్మగార్ల మూడవ కుమార్తెతో వివాహము జరిగినది.

గత ఐదు సంవత్సరాలుగా సెమినరీకి సహాయము రానందున మాకు జీతాలు లేవన్నా, ఇప్పుడు ఇల్లు కూడా ఖాళీ చేయాల్సి వస్తుంది, ఇల్లు ఖాళీ చెయ్యటానికి ఇంకా నెల రోజుల గడువు ఉంది ప్రభువు చిత్తమే నెరవేర్చ బడుతుంది . "నేను సెమినరీలో ఉద్యోగము చేసే రోజులలో ఇంటి నివాసమునకై రామాయపట్నంలో ఒక స్థలము కొన్నాను. అప్పుడు నేను నా స్థలములో చర్చి కట్టించాలని తీర్మానించుకున్నాను. నా ఆధ్యాత్మిక స్థితికి కారకుడైన బ్లాంచర్డు దొరగారి పేరు మీద ఆ చర్చి కట్టించాలను కున్నాను. 1998 నుండి సెమినరీకి సహాయము సరిగా రావడం లేదు. అప్పుడు ఫైనాన్స్ ఆఫీసరుగారైన పాస్టర్ దివాకర్‌గారు నాకు నాలుగు నెలల జీతం ఇచ్చి నిలిపివేశారు. అది చాలా కష్టమైన విషయం అనిపించింది. కాని అది దైవ నిర్ణయమని తరువాత తెలుసుకున్నాను. ఎలాగంటే మొదటగా - 2000 సంవత్సరంలో సెమినరీ స్టూడెంట్‌గా చేరి పూర్తిచేశాను. రెండవది - నాకు ఉద్యోగము లేనందున చర్చి నిర్మాణము పూర్తిచేశాను.

సెమినరీ కాంపౌండులో నేను నివశిస్తున్న ఇల్లు ఖాళీ చేయవలసి వస్తున్నందుకు ప్రభువుకు స్తోత్రము. ఇప్పుడు నేను చర్చి వద్దనే కాపురముండుట ద్వారా ఎక్కువగా ఆత్మలను సంపాదించుటకు వీలుకలుగుతున్నది. కొందరు రోగులు, అనాథలు నా సంరక్షణలో ఉన్నందున వారికి కూడ పూర్తి పరిచర్య చేయుటకు వీలవుతుంది . కాని ప్రభువు ఇల్లు ఖాళీ చేయించలేదు. ఎంతోమంది రోగులకు మందులు, భోజనము అందించటం, కంటి పరీక్షలు చేయించి కండ్ల అద్దాలు కొనివ్వడం వంటి కొన్ని ఆత్మసంతృప్తి కార్యాలను జరిగించుట ప్రభువు కృప వలన సాధ్యపడినది. నా సువార్త సేవకు పూర్తిగా సహకరించే భార్యను నాకు జత చేసిన దేవునికి వందనాలు.

దేవుడు ముగ్గురు కుమారులతో నన్ను ఆశీర్వదించాడు.

పెద్ద కుమారుడు కిశోర్‌బాబు మంచిర్యాలలో గవర్నమెంట్ టీచర్‌గా పనిచేస్తున్నారు, రెండవ కుమారుడు నిరంజన్ బాబు ఇల్లెందు గనులలో ఇంజనీరుగా ఉన్నారు, మూడవ కుమారుడు కిరణ్ ప్రభాకర్ ప్రకాశం జిల్లాలో మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్‌గా పనిచేస్తున్నారు. దేవుని కృపలో బిడ్డలు ముగ్గురికి వివాహాలు జరిగాయి. వారికందరికి పిల్లలు ఉన్నారు.

కన్నవారికి, తోబుట్టువులకు, బంధువులకు, దూరమై ఒంటరియైన నన్ను దేవుడు అన్ని విధాల ఆదరించి, నా అవసరాలన్ని తానే తీర్చి నన్ను విశ్వాసంలో బలపరచి, నాకు కుటుంబమును, ఆత్మీయులను, ఆప్తులను కలుగజేసి ఆయన నామమహిమార్థం నా జీవితం ఒక సాక్ష్యంగా మలచిన ఆ దేవదేవునికి వందనాలు.

ముగింపు:

అన్యమతస్థుడైన ఖుద్దూస్‌గారు సత్యమును గ్రహించి రక్షకుడైన యేసును అంగీకరించి, అనేక శ్రమలకు ఓర్చి , ప్రభుదాస్‌గా మారి తనదైన శైలిలో అనేక సేవాకార్యక్రమాలు జరిగించి ఎంతోమందికి ఆర్థికంగా సహాయసహకారాలు అందించి మంచి సాక్షిగా, వ్యక్తిగత జీవితంలో మంచి కుటుంబ నాయకునిగా జీవించి తన 69వ ఏటా ప్రభువు పిలుపుమేరకు మహిమ ప్రవేశం చేసినారు.

**(సమాప్తం)**

## సాక్ష్యాలకు ఆహ్వానము

మీ జీవితాలలో దేవుడు చేసిన మేలులను ఇతరులకు తెలియపరచుట ద్వారా దేవుని నామానికి మహిమ కలగడమే కాక వినినవారు విశ్వాసంలో బలపడుటకు మీ సాక్ష్యం ఉపయోగపడవచ్చు. కావున మీ అమూల్యమైన సాక్ష్యాలు మాతో పంచుకొనిన యెడలవాటిని సంతోషంగా పత్రికా ముఖంగా ప్రచురించుటకు మేము సిద్ధంగా ఉన్నాము. దేవుని నామ ప్రకటనలో మాతో పాటు మీరు పాలి భాగస్తులు కావాలని ఆశిస్తున్నాము.

## కొడవటికంటిగారి రచనలు

| | | |
|---|---|---|
| 1. | మడిమెను పట్టుకొనినవాడు | రూ. 40 |
| 2. | జన్మత్వసేహు | రూ. 250 |
| 3. | అపొస్తలుడు | రూ. 250 |
| 4. | నా చిత్తానుసారుడు | రూ. 250 |
| 5. | మిక్కిలి సాత్వికుడు | రూ. 150 |
| 6. | విశ్వాసంలో ఓ మెట్టు | రూ. 60 |
| 7. | విశ్వాసంలో మరో మెట్టు | రూ. 65 |
| 8. | తోటలో పనివాడు | రూ. 20 |
| 9. | గోత్రకర్త (యాకోబు) | రూ. 50 |
| 10. | నా కుటుంబము | రూ. 25 |
| 11. | నా దూత (బాప్తిస్మమిచ్చు యోహాను) | రూ. 50 |
| 12. | నా కుమారి (రూతు) | రూ. 60 |
| 13. | నా స్నేహితుడు | రూ. 50 |
| 14. | అంత్యదినములలోని యథార్థ ప్రవక్త | రూ. 50 |
| 15. | హన్నాకృప సజీవసాక్ష్యాలు -1 | రూ. 65 |
| 16. | హన్నాకృప సజీవసాక్ష్యాలు -2 | రూ. 65 |
| 17. | ప్రయాణంలో ఓ మజిలి | రూ. 65 |
| 18. | నాజరు (సమ్సోను జీవిత చరిత్ర) | రూ. 65 |
| 19. | సువార్తలలోని యేసుకథ | రూ. 75 |
| 20. | యేసుకథ రెండవ భాగం | రూ. 75 |
| 21. | యేసుకథ మూడవ భాగం | రూ. 75 |
| 22. | జీవనమంతయు | రూ. 40 |
| 23. | టాల్‌స్టాయ్ కథలు 1 భాగము | రూ. 65 |
| 24. | టాల్‌స్టాయ్ కథలు 2వ భాగము | రూ. 65 |
| 25. | ఓ చినుకునవుతా... | రూ. 30 |
| 26. | గుంట నుండి మింటికి | రూ. 50 |
| 27. | విశ్వాసము విజయము-1 | రూ. 70 |
| 28. | విశ్వాసము విజయము-2 | రూ. 70 |
| 29. | విశ్వాసము విజయము-3 | రూ. 70 |
| 30. | హదస్సా | రూ. 70 |

పుస్తకములు కావలసినవారు :
రెవ. డా॥ కొడవటికంటి ఇమ్మానియేల్ రాజేంద్ర
కృపాదానంగారివీధి, క్లౌపేట, 6వ లైను
ఒంగోలు-523001
ప్రకాశం జిల్లా, ఫోన్ : 9440217726

# నీ సృష్టికర్త

భూమి మాత్రమే మానవ నివాస యోగ్యంగా తయారు చేయబడింది. అంటే భూమిలోని వాతావరణానికి అను గుణంగా మానవ శరీరము లేదా శరీరము యొక్క చర్మము తయారు చేయబడింది అనవచ్చు. ఎందుకంటే వాతావర ణానికి నేరుగా సంపర్కంలోకి వచ్చే మానవశరీర భాగం చర్మమే.

మానవ శరీరంలో అతి పెద్ద అవయవం చర్మం. చర్మంలో మూడు పొరలు ఉంటాయి. మొదటిది ఎపిడెర్మిస్, ఇది మనకు కనిపించే చర్మ భాగం ఇది శరీరాన్ని వాతావ రణంలోని హాని కలిగించే రకరకాల బాక్టీరియాల నుండి కాపాడే అతి పెద్ద రక్షణ వలయం. ఈ చర్మపు భాగం కాస్త మందంగా ఉంటుంది. ఈ చర్మ భాగంలో ఉండే కెరోటిన్ అనే రసాయనం కారణంగానే చర్మంపై వెంట్రుకలు నిక్కబొడుచు కోవటం వంటివి మనం గమనిస్తుంటాం. శరీర భాగాలనుబట్టి ఈ పొర మందం మారుతుంటుంది. అత్యధికంగా పాదంవద్ద మందంగా ఉండగా, అత్యల్పంగా కనురెప్పలపైన ఉంటుంది.

రెండవ చర్మ వలయం డెర్మిస్. ఇందులో ఎన్నో రకాల కణజాలాలు ఉంటాయి. ప్రతి కణజాలం దాని యొక్క నిర్దిష్టమైన పనిని నెరవేర్చుటకు రూపొందించబడింది. ఈ భాగం కాస్తంత మృదువుగా ఉండి, సాగే గుణాన్ని కలిగి ఉంటుంది. చర్మం ఒక జ్ఞానేంద్రియం. స్పర్శకు సంబం ధించిన కణజాలాలు ఈ పొరలోనే ఉంటాయి. ఈ పొరలోని ప్రొటైజెస్ అనే కణజాలం వాతావరణానికి తగ్గట్టుగా సంకోచ వ్యాకోచాలు చెందుతుంది. వాతావరణం చల్లగా ఉన్నట్లయితే ఈ కణజాలం శరీరానికి తగిన వేడిని అందించడానికి సంకోచిస్తాయి. అప్పుడే మనం వాతావరణం చల్లగా ఉందని గ్రహించగలుగుతాం. వణకటం ప్రారంభిస్తాం. అలాగే సూర్యుని తాపాన్ని గ్రహిస్తాం. ఏదైనా వస్తువు శరీరానికి తగిలినప్పుడు నొప్పి, బాధ, మంట వంటి వాటిని కూడా ఈ వలయంలోని కణజాలాలు గ్రహించి దానికి తగిన సంకేతాలను మెదడుకు పంపిస్తాయి. అప్పుడు మనం అబ్బ అని నొప్పిని ఫీలౌతాం. ఈ పనంతా రెప్పపాటు కాలంలో జరిగిపోతుంది.

మూడవది హైపోడెర్మిస్. ఇది చాలా మృదువుగా ఉండి సాగే గుణాన్ని కలిగి ఉంటుంది. మనం తినే పదార్థాలలోని అధిక క్రొవ్వంత చేరేది ఈ పొరలోనే.

**చర్మం గురించి కొన్ని ఆసక్తికరమైన విషయాలు:**

మానవ చర్మం దాదాపు 22.5 చ॥మీ మేర విస్తరించి ఉంటుంది. ఎదిగిన వ్యక్తి చర్మం దాదాపు 20 పౌండ్లు అంటే 9 కేజీల బరువును కలిగి ఉంటుంది. ఇది మనిషి శరీర బరువులో 15%.

మానవ చర్మం సూర్యకాంతిని విడమిన్ 'డి'గా మార్చగలదు. చర్మం ఒక చదరపు గజానికి 300 స్వేద గ్రంథులు ఉంటాయి. ఇవి శరీర ఉష్ణోగ్రతకు తగినట్లుగా పనిచేస్తూ వాతావరణంలో ఉష్ణోగ్రత ఎక్కువగా ఉన్నప్పుడు శరీరాన్ని చల్లపరచడానికి స్వేదాన్ని ఉత్పత్తి చేస్తాయి.

చెమటకు అసలు వాసనే ఉండదు. చెమట ఎప్పుడైతే చర్మం పైభాగంలో ఉండే బాక్టీరియాతో కలుస్తుందో అప్పుడు చెడువాసన వస్తుంది. మానవ ఎముక మజ్జలో తయారయ్యే మైక్రోఫాజియస్ అనే వ్యాధినిరోధక కణాలు చర్మ రక్షణ వలయంలోఉండి నిరంతరం వాతావరణంలోని బాక్టీరియాతో పోరాడుతూ ఉంటాయి.

చర్మంలోని కణాలు చనిపోయి రాలిపోతుంటాయి వాటి స్థానంలో దాదాపు 28 రోజుల నుండి 45 రోజులలోపు క్రొత్తకణాలు పుడుతుంటాయి. ఒక నిమిషానికి దాదాపు 30 నుండి 40 వేల కణాలు చనిపోయి రాలిపోతాయి. అంటే ఒక గంటలో 200 మిలియన్ కణాలనమాట.

మన ఇంటిలో ఉండే దుమ్ములో సగానికి పైగా చనిపోయి రాలిపోయిన మన చర్మకణాలు ఉంటాయట.

ఈ విషయాలను నిశితంగా పరిశీలిస్తే దేవుడు మానవునిపట్ల ఎంత శ్రద్ధ తీసుకున్నాడో అర్థమవుతుంది. నీ సృష్టికర్త చూపిన శ్రద్ధకు, ప్రేమకు నీవు చూపే కృతజ్ఞత ఏ విధంగా ఉన్నదో ఆలోచించుము.

ఆధునిక దృక్పథం

క్రొత్త కోణాలు

# 10. క్రిస్మస్- పండుగ, పబ్బం

## Christmas Message

**“ఒకడు క్రొత్తగా[1] జన్మించితేనే కాని అతడు దేవుని రాజ్యమును చూడలేడు” యోహా. 3:3**

Except a man be born again, he cannot see the Kingdom of God•KJV.

**వస్తుందండోయ్ క్రిస్మస్! మన గుళ్ళకు, ఇళ్ళకు సున్నాలు, క్రిస్మస్ చెట్లు, నక్షత్రాలు, కేకులు, క్రొత్త గుడ్డలు, రబ్బరు బుడ్డలు, కేరల్ పార్టీలు, డ్రామా కర్టెన్లు, గుళ్లో బోధలు, క్రిస్మస్ అనంతరం అప్పుల బాధలు... అన్నీ వస్తున్నాయోయ్, వచ్చిన దోవనె పోతున్నాయోయ్, మనం మాత్రం ఇళ్ళలో, గుళ్ళలో ఎక్కడి గొంగళ్ళలా అక్కడే పడి ఉంటున్నామోయ్! క్రీస్తు పుట్టాడు గాని మనం తిరిగి పుట్టడంలేదోయ్. పండుగరోజు కూడ సాతానే మన పాత మొగుడోయ్.**

సామాజిక స్పృహ కలిగినప్పటి నుండి మనుష్యులు పండుగలు (Festivals), పబ్బాలు విందులు, (Feasts) చేసుకుంటూనే ఉన్నారు- దయ్యం పేరటనో, దైవం పేరటనో లేక ఏదో ఒక సాకు పెట్టుకొనో. అది ఎప్పుడో ఒకప్పుడు కానీ, అప్పుడప్పుడు ఏడాదికో పుష్కరానికో కానీ, దుఃఖంలో మునిగి కానీ, సంతోషంలో తేలుతూ కానీ, బయలు అస్త్రాతో దేవతల కొలువుల్లో వలె బరితెగించి కానీ పరిశుద్ధ సంఘ ఆత్మీయానంద పారవశ్యంలో కానీ, ఒక మతకట్టుబాటులో ఆచరించినంత మేరకు దాన్ని పండుగనీ, లేక పవిత్రదినం అనీ అనవచ్చు.

లోకవ్యాప్తంగా మృతుల పేరట పండుగ పబ్బాలు, దినాలు (ఈ మాట క్రైస్తవులు అనరులెండి), జ్ఞాపకార్ధకూటాలు ప్రతి కుటుంబానికీ ప్రధానమైనా, పండుగలన్నీ జనన మరణాలు, వివాహాది ఉత్సవాలతోనే పరిమితంకావు. కోతకాలపు కృతజ్ఞతార్పణాలు, భయాందోళనలతో దెయ్యాన్నో దేవుణ్ణి మెప్పించే బలులు, యాగాలు, తర్పణాలు, వారాని కోసారి చేసే క్రైస్తవారాధనలు మొదలైనవన్నీ ఈ కోవలోనివే. అందుకే ప్రతిమతంలో మత పంచాంగాలు ఉండనే ఉన్నాయి. క్రైస్తవుల్లో క్యాథలిక్కులు, చర్చ్ ఆఫ్ ఇంగ్లాండ్, లూథరన్ మొదలైన శాఖల్లో సంవత్సరంలో దాదాపు ప్రతి వారం, రోజు ఏదో ఒక పేరుతో ఆరాధనలు, జపాలు ఉంటూనే ఉంటాయి.

బాప్టిస్టుల్లాంటి ప్రొటెస్టెంటులకు మాత్రం పట్టుమని మూడంటే మూడు పండుగలే ఉన్నాయి, క్రొత్త సంవత్సరం, గుడ్ ఫ్రైడే, ఈస్టరు, క్రిస్మస్. కొన్ని పెద్ద సంఘాల్లో కోతకాలపు పండుగనేది జరుగుతుంది.

క్రైస్తవ మతానికి నారుమడి యూదా మతమనాలి. యూదుల జీవన విధానమంతా యూదా మత ప్రధానమైంది. వారికి వారి మత పంచాగం (religious calendar) నిండా పండుగలున్నాయి. పాత నిబంధనకాలంలో యూదేతర మతాలు, యెహోవాకు ప్రత్యర్ధులుగా రా, బయలులాంటి దేవతలుండేవారు. ఆ దేవతల మతం విగ్రహారాధన మయమైంది. వారి పండుగలు, ఉత్సవాలు మద్యపానం, హద్దూ ఆపు లేని, వావి వరసులు లేని, లైంగిక భ్రష్టాచారాలతో జుగుప్స కలిగించే సామూహిక దుర్ఘటనలతో నిండి ఉండేవి.

అలాంటి కాలమాన పరిస్థితుల్లో యూదుల పండుగలు పవిత్రంగాను, హృదయ శుద్ధితోను, స్వపరీక్షతోను ఆచరించేవిగా ఉండేవి. ప్రతి ఏడోరోజు, ఏడో సంవత్సరం, 7x7=50వ ఏట విశ్రాంతిదినం/సంవత్సరంగా పరిశుద్ధంగా ఆచరించటం యూదా మతవిధాన ప్రత్యేకత. అవికాక లేవీయకాండం 23వ అధ్యాయంలో మోషే కాలానికి చెందిన సూర్యాయనంతో ముడిబడి ఏడు ప్రధాన పండుగలు చేసేవారు. వసంతోత్సవకాలం (veral equinox)కు సంబంధించి మూడు పండుగలు (పస్కా, పులియని రొట్టెల పండుగ, పెంతెకొస్తు), మకర సంక్రాంతి (autumnal equinox)కు సంబంధించి నాలుగు పండుగలు (బూరల, ప్రాయశ్చిత్తార్ధ దినం, పర్ణశాలల, హోమార్పణ వ్రతదిన పండుగలుండేవి. ఆ తరువాత కాలాలలో (ఎస్తేరు, ఎజ్రా) ప్రతిష్ఠిత, (యోహా. 10:22), పూరీము పండుగలు కూడ చూడగలం.

1. క్రొత్తగా లేక పైనుండి. ఈ మాట ఇంగ్లీషులో again (=తిరిగి) అని ఉంది. ఈ మాటలు నీకొదేముతో చెప్పినవి (యోహా. 7:50, 19:39)

అన్యుల పండుగలకు, యెహోవా ప్రజల పండుగలకు, వాని ఆచారాలకు కొండంత తేడా ఉంది. భక్తి, విశ్వాసం, మౌనం, సిద్ధపాటుతో కూడి, పండుగల్లో పాల్గొనే వారంతా పరిశుద్ధ సంఘం (Holy Convocation)గా భయంతో, నమ్రతతో, కృతజ్ఞతాపూర్వక హృదయంతో పండుగల్ని ఆచరించాల్సి ఉండేవి. మధ్యపానానికి ఇసుమంతైనా పొత్తులేని 'పులియని రొట్టెలు', రుచికర భోజ్యాలు కాకుండా చేదు కాయకూరలు, పరిశుద్ధమైన గొఱ్ఱెపిల్ల మాంసం మొదలైనవే వారి పండుగల్లో తినుబండారాలు.

అలాంటి నేపథ్యంలో యూదుడుగా పుట్టిన యేసు, ఆయన శిష్యులు తమ జీవితకాలంలో యూదా పండుగల్ని ఆచరించినట్లు క్రొత్త నిబంధనలో కొట్టవచ్చినట్లు కనుపిస్తుంది. సునగోగులకు వారు పోయారు కనుక సబ్బాతును ఆచరించినట్లు కూడ చెప్పగలం. క్రీస్తు పునరుత్థానుడైన తరువాత, ఆదివారాన్ని ప్రభువుదినంగా ఆచరించినట్లు క్రొత్త నిబంధనలో దాఖలాలున్నాయి (యోహా. 20:19,26, 1కొరిం. 26:2, అపొ. 20:7, ప్రక. 1:10). అలానే పెంతెకొస్తు (అపొ. 2అ).

అందునుబట్టి మనం గొప్ప ఎత్తున ఆచరించే క్రిస్మస్‌కు గాని, దానిని ఆచరించే తిథి (డిసెంబరు 25)కి గాని ఏ దైవ బైబిలు ఆధారం ఉందా అంటే ఉందో లేదో చదువరులు చెప్పాల్సిందే కాని నా వల్ల కావటం లేదు!

మన దేశానికి, ప్రత్యేకించి బంగాళాఖాత తీరానికి క్రైస్తవ మతం సూటిగా పాలస్తీనా నుండి రాలేదు. (తోమా భారత దేశానికి వచ్చాడనే సాంప్రదాయమున్నా ఆయన ప్రభావం మన మీదకు రాలేదు. మనకు క్రైస్తవ్యం వచ్చింది ఇంగ్లాండు, అమెరికాల్లాంటి పాశ్చాత్య దేశాల నుండి. దురదృష్టవశాత్తు దివ్యమైన మతంతో పాటు పాశ్చాత్య సంస్కృతి, సాంప్రదాయాలు మన పల్లెటూరి సంఘాల్లో సహితం చోటు చేసుకున్నాయి. క్రిస్మస్ ఉత్తరార్ధగోళంలో ఉండే వారందరికీ ఏదో ఒక మోతాదులో చలికాలంలో వస్తుంది. కాని మన దేశంలో దక్షిణాదిన పాశ్చాత్యదేశాల్లో ఉన్నంత చలిగాని, మంచు (snow)గాని ఉండదు. ఆ దేశాల్లోని సతత హరిత వృక్షాలు (evergreens) లేక శంకు ఆకారపు (conifers) గాని మనకు లేవు. అయినా అలాంటి క్రిస్మస్ చెట్టునే, మంచు లేకపోతే దూది పింజల్ని నేసి తయారు చేస్తారు. క్రిస్మస్ తాత ఒక కల్పిత గాథ. ఆయన వేషంకాని, రెయిన్ డీర్ (కొమ్ములజింక) గాని, అదిలాగే మంచుబండి (sledge)గాని మన దేశస్థులు క్రిస్మస్‌తో ముడిపెట్టాల్సిన అవసరం లేదు. క్రిస్మస్ కార్డులనేవి మన సాంప్రదాయమే కాదు. కేరల్ పార్టీ అనేది పాలస్తీనా సాంప్రదాయం కాదు. ఈ కలగాపులగమంతా క్రిస్మస్ ఆచరించాల్సిన విధానాన్ని చాల తప్పుత్రోవ పట్టిస్తుంది. కొంతమంది అమాయకులు ఈ సంగతులన్నీ బైబిల్లో ఉన్నాయేమో అని అనుకున్నా ఆశ్చర్యపడనక్కర లేదు.

**డిసెంబర్ -25**

క్రిస్మస్ ఆది క్రైస్తవ సంఘం పండుగల్లో ఒకటి కాదు. క్రీ.శ. 400 దాకా అది ఆచరించాల్సిన తేది నిర్ణయించబడనే లేదు. డిసెంబర్ 25 అనేది ఏకాభిప్రాయానికి రానేలేదు. యేసుక్రీస్తు ఈ లోకంలో బేత్లహేములో జన్మించిన చారిత్రాత్మక వ్యక్తి అనేది మాత్రం నిర్వివాదాంశం. అయితే, ఫలానా తేదీన పుట్టాడన్నది నేటికీ నిర్ణయింపబడని అంశం. ఈ తేదీకి ఆధారం క్రీ.శ. 180 ప్రాంతంలో అంతియొకు వాసి థియొఫిలాస్ వ్రాసిన పుస్తకం మీద ఆధారపడింది. అలా వ్రాయటానికి అతనికున్న ఆధారాలు ప్రశ్నింపదగినవి. ఆ తరువాత క్రీ.శ. 202లో హిప్పొలిటస్ అనే పండితుడు దానియేలు 4:23 మీద రాసిన వ్యాఖ్యానం పుటలో యేసు బేత్లహేములో డిసెంబరు 25 (బుధవారం) కైసరౌగుస్తు 42వ సంగలో జన్మించాడని ఎవరో హంసపాదు వేసి రాశారు (interpolated) ఏది ఎలా అయినా, క్రిస్మస్ ఆచరించటంలో ఆనాటి సనాతనాలోచనల్లో విందులు వినోదాలకు తావు ఉండేది కాదు. క్రీ.శ. 245లో ఓరిజన్ లేవీయ గ్రంథానికి రాసిన వ్యాఖ్యానంలో క్రీస్తు దినాన్ని 'తానేదో ఫరో రాజైనట్లు' వైభోగంగా ఆచరించే ఆలోచనా సరళిని ఖండించాడు. క్రీ.శ. 345లో ఫిరోకేలస్ క్రీ.శ. 1, డిసెంబరు 25వ తేది (నెల పొడుపు తరువాత 15వ తేదీ) ఒక ఆదివారమని రాశాడు. అయితే, అదొక పండగ విందు రోజనలేదు. అలెగ్జాంద్రియాకు చెందిన క్లెమెంతు ఈ జన్మదిన నిర్ణయాన్ని ఊహాగానమని ఖండించాడు. ఒకరు మే 20గా, మరొకరు ఏప్రిల్ 19 లేక 20గా నిర్ణయించారు. క్లెమెంతు మట్టసానికి క్రీస్తుపుట్టక క్రీ.పూ. 3, నవంబరు 17గా లెక్కగట్టాడు. ఇలా ఈ తేదీ నిర్ధారణ ఇంత వరకు ఎవ్వరూ నిర్ణయించేలేదు.

## ఎపిఫనీ

క్రిస్మస్ పండుగకు పన్నెండో రోజు (జనవరి 6)ను 14వ శతాబ్దపు గ్రీకు సంఘ పితరులు ఎపిఫని (Epiphany)గా ఆచరించారు. 1తిమో. 4:14లో క్రీస్తు ఆగమనమని, 2థెస్స. 11:8లో 'తేజస్'-అంటే, యొర్దాను నదిలో బాప్తిస్మ సందర్భంగా ప్రకాశించిన వెలుగు అని చెప్పవచ్చు. దీనిని దీపాల పండుగ (Day of Lights)అని, ప్రకటిత దివసం (Feast of Declaration)అని, క్రీస్తు ఆత్మ రూప దర్శనము (Apparition of Christ Day), ద్యోతక దినం (Feast of Manifestation) అని వివిధ నామాలిచ్చారు. జ్ఞానులు దేవకుమారుని దర్శనం చేసుకొనటాన్ని జ్ఞాపకం తెచ్చుకొనే దినమని కూడ సూచించారు.

## క్రిస్మస్ పండుగ

కనుక, క్రీస్తు జన్మం నిర్వివాదాంశమే గాని క్రిస్మస్ పండుగ క్రొత్త నిబంధనానుసారమైందని కాని, దాని ఆచరణ దినం డిసెంబరు 25 అనేదిగాని కేవలం ఒక అనిర్ధారిత విషయమని, దాన్ని మనదేశంలో ఆచరించే విధం పాలస్తీనా సంస్కృతిపైన గాక పాశ్చాత్య దేశాల సంస్కృతిపై, కట్టుకథలపై ఆధార పడినదని, అన్నింటికన్నా ముఖ్యంగా, క్రిస్మస్‌ను భోజన పానాదులతో, విందు వినోదాలతో, ఖుషీ చేయటంలో ఆచరించటం క్రైస్తవ మతానికి గాని, దానికి నారు మడియైన యూదా మతానికి గాని భిన్నమైందని గ్రహించటం సులభమే. అలా అయితే ఈ పండుగను అసలెందుకు ఆచరించాలి?

## క్రిస్మస్‌నసలెందుకు ఆచరించాలి?

క్రీస్తు ఈ లోకానికి రావటం ప్రధానం కాదు. ఎందుకు వచ్చింది ప్రధానం. బైబిలు ప్రకారం నశించిన దానిని వెదకి రక్షించటానికి యేసు పుట్టాడు (లూకా 19:10). ఆయన యందు విశ్వాసముంచు ప్రతివాడు నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను దేవుడు మనకు అనుగ్రహించాడు (యోహా. 3:16). తన్ను ఎందరంగీకరించిరో వారికందరికి, అనగా తన నామమునందు విశ్వాసముంచిన వారికి దేవుని పిల్లలగుటకు ఆయన అధికారము అనుగ్రహించెను (యోహా. 1:12). మనము నీతిని అనుసరించి చేసిన క్రియల మూలముగా కాక, తన కనికరము చొప్పుననే పునర్జన్మ (పునఃస్థితస్థాపన) సంబంధమైన స్నానం ద్వారాను మనలను రక్షించుటకు పుట్టాడు (తీతు. 3:5). కనుక, క్రిస్మస్ రోజు మనం తిని, త్రాగి అన్యులవలె ఆనందించి మన పాపస్థితిని మరచి పోవటానికి రాలేదు.

క్రీస్తు ఈ లోకంలో ఎక్కడ పుట్టింది ప్రధానం కాదు. బేత్లహేమని ప్రవచనాలు ఘోషింపవచ్చు, తూర్పుదేశ జ్ఞానులను నక్షత్రం నడిపించవచ్చు, గొల్లల కాపరులకు పరలోక దూతలు ముఖాముఖిగా చెప్పవచ్చు. కాని, క్రీస్తు, పాపుల (అంటే, నీ, నా) హృదయాల్లో పుట్టక పోతే అది లోకమంతటికి మేలు కావచ్చునేమో! కాని నీకూ, నాకూ ప్రయోజనమేమిటి? ప్రయోజనంలేని పండుగ ఆచరించటం బుద్ధితక్కువ కదా!

క్రీస్తు ఈ లోకంలో ఎప్పుడు పుట్టింది ప్రధానం కాదు. డిసెంబరు 25, జనవరి 6, మే 10 ఏ తేదీన అయితేనేం, ఏ సంవత్సరమైతేనేం. కాలమొక అనంత ప్రవాహం. క్రీస్తు అన్ని కాలాల్లో ఉన్నవాడు. ఆయన ప్రతి క్షణం ఈ నాటికీ పుడుతూనే ఉన్నాడు. ఆయన నాడు కష్మషమైన పశువుల పాకలో పుట్టాడు. నేడు మారుమనస్సు పొందిన నీ హృదయంలో పుట్టాలి. అలా పుట్టకపోతే ఆయన వచ్చిన ఉద్దేశం నీలో నాలో నెరవేరదు. నెరవేరని ఉద్దేశాల కోసం పండుగ చేసి లాభం ఏమిటి? క్రొత్తగా జన్మించకపోతే దేవుని రాజ్యంలో ప్రవేశించం. క్రీస్తు జన్మించాడు సరే. క్రొత్తగా జన్మించాల్సింది నీవూ, నేనూ.

ఆ వరుసకు వస్తే, క్రీస్తు ఎప్పుడో ఒకసారి పుట్టాడని పండుగ చేస్తాం. కాని ఆయన క్షణం క్షణం ఎవరో ఒకరి గుండెల్లో తిరుగ, తిరుగ పుడుతున్నాడు. ఈ తిరిగి పుట్టడమే క్రిస్మస్!

"క్రొత్త సృష్టి పొందుటయేగాని సున్నతి పొందుట యందేమి లేదు, పొందకపోవుటయందేమీలేదు" (గలతీ. 6:15).

ఒక క్రొత్తకోణంలో నేనంటున్నాను క్రిస్మస్ పండుగ ఆచరించుటయందేమి లేదు, ఆచరించక పోవుటయందేమీ లేదు. ఇక్కడ, ఇప్పుడు నీ హృదయంలో క్రొత్తగా జన్మించటమే రక్షణకు మూలం.

**వచ్చేమాసం: శాంతికరులు -దేవుని కుమారులు**

# తార వెలసింది

హన్నాకృప పాఠకులకు క్రిస్మస్ శుభాకాంక్షలు.

క్రిస్మస్ పండుగ అనగానే ప్రతి క్రైస్తవుని ఇంటిలో ఒక స్టార్ వెలిగిస్తారు. ఎందుకంటే క్రీస్తు బేత్లెహేములో జన్మించినప్పుడు ఆకాశమందు ఒక తార వెలసింది. ఈ తార తూర్పు దేశపు జ్ఞానులను ఆ స్థలమునకు చక్కగా నడిపించింది. ఇది ఒక వింతైన తార, చీకటిలో ఉన్న వారికి ప్రకాశమానమైన తన వెలుగు ద్వారా త్రోవను చూపింది. దేవుడు సృష్టి కార్యమును ఆరంభించినప్పుడు ఈ లోకంలో మొదటిగా వెలుగును చేశాడు. పగటిని రాత్రిని వేరుపరచునట్లు ఆకాశ విశాలమందు జ్యోతులను కలుగ జేసెను. భూమి మీద వెలిగిచ్చుటకు సూర్యుని, చంద్రుని, నక్షత్రములను దేవుడు చేసెను. (ఆది. 1:14-18).

అటువలె, అంధకారంలో నుండి వెలుగు ప్రకాశించును గాక అని పలికిన దేవుడే, తన మహిమను గూర్చిన జ్ఞానము యేసుక్రీస్తునందు వెల్లడిపరచుటకు మీ హృదయములలో ప్రకాశించెను. (2కొరింథీ 4:6). యేసుక్రీస్తు ఈ లోకము నకు వెలుగుగా వచ్చి, మన మీద ఆయన వెలుగును ప్రకాశింపచేసి, చీకటిలో నుండి మనలను వేరు (వెలుగు) వేరుపరచెను. ఆయన వాక్యమునందు విశ్వాసము ఉంచుట ద్వారా మనకు వెలుగు కలిగెను. నీ వాక్యములు వెల్లడి అగుట చేతనే వెలుగు కలుగును. (కీర్తనలు 119:130).

అంతేకాక మనల్ని చీకటిలో నుండి ఆశ్చర్యకరమైన తన వెలుగులోనికి మనల్ని పిలిచిన వాని గుణాతిశయము లను ప్రచురము చేయు నిమిత్తము, మనల్ని ఏర్పరచబడిన వంశముగాను, రాజులైన యాజక సమూహముగాను, పరిశుద్ధ జనముగా, దేవుని సొత్తైన ప్రజలుగా చేసెను. (1పేతురు 2:9) మనము ఈ లోకములోని జనముల మధ్య జీవవాక్యమును చేతపట్టుకునిన జ్యోతులవలె కనబడాలి. (ఫిలిప్పీ 2:16) మనం బుద్ధిమంతులుగా ఆకాశమండలం లోని జ్యోతులను పోలిన వారై ప్రకాశించాలి, నీతి మార్గమును అనుసరించి నడుచుకుంటూ అనేకమైన ఆత్మలను దేవుని వైపు త్రిప్పే నక్షత్రములవలె నిరంతరము ప్రకాశించాలని దేవుని ఆశ (దానియేలు 12:3). మనము భూదిగంతముల వరకు రక్షణార్థముగా ఉండునట్లు మనల్ని అన్యజనులకు వెలుగుగా ఉంచి ఉన్నాడు. (అపొ.కార్య. 13:47) మనుషులు మన సత్క్రియలు చూచి పరలోక మందున్న మన తండ్రిని మహిమ పరచున్నట్లు వారి ఎదుట మన వెలుగును ప్రకాశింపచేయాలి. (మత్తయి 5:16).

మంచితనము, నీతి, సత్యము అనే వెలుగు ఫలమును ఫలించాలి, వెలుగు సంబంధులువలె దేవునితో కలిసి నడుచు కోవాలి. ఈ మాటలు చదువుతున్న నీవు వెలిగించబడ్డావా? ఈ గొప్ప దేవుని వెలుగు నీకు కావాలా? అయితే యేసుక్రీస్తును విశ్వసించి నీ హృదయంలోనికి ఆయనను ఆహ్వానించుట ద్వారా నీవు కూడా ఈ జీవపు వెలుగును పొందుకొని ఆకాశమందున్న గొప్ప జ్యోతులవలె నక్షత్రము వలె ప్రకాశించుము. నేడే రక్షణ దినము, ఇదే మిక్కిలి అనుకూలమైన సమయము, ఇదే నిజమైన క్రిస్మస్.

**-ఇట్లు డా॥ సుష్మ ప్రశాంత్, నెల్లూరు**



**పాఠకులకు, చందాదారులకు, శ్రేయోభిలాషులకు**

**క్రిస్మస్** మరియు

**నూతన సంవత్సర శుభాకాంక్షలు!!**

**- ఎడిటర్ మరియు సిబ్బంది**



# నన్ను పంపినవాని చిత్తము

ఈ భూమి మీద మనిషిని దేవుడు తన కోసం సృష్టించుకున్నాడు. అయితే, దేవుడు జగత్తు పునాది వేయబడక మునుపే తన కోసం సృష్టించుకున్న మనిషిని దేవునికి దూరం చేయడానికి సాతాను ఈ లోకాశలనే బంధకాలతో మనిషిని బంధించింది. సాతాను కబంధ హస్తాలలో చిక్కి, పాపములో కూరుకొని పోయి విలవిలలాడుతూ నశించి పోతున్న మానవాళిని రక్షించడానికి తండ్రి చిత్త ప్రకారం యేసుప్రభువు ఈ లోకానికి వచ్చాడు. 'చిత్తము' అంటే 'ఇష్టము' అని అర్ధము. దేవుని చిత్తాన్ని నెరవేర్చడమంటే, దేవుని ఇష్టాన్ని నెరవేర్చడం. తండ్రి చిత్తాన్ని నెరవేర్చడం కోసం యేసుప్రభువు ఈ లోకమునకు వచ్చినట్లే, ఈ భూమి మీద పుట్టిన మనము దేవుని ఇష్టాన్ని మన జీవితంలో నెరవేర్చాలి. దేవుని ఇష్టాయిష్టాలేంటో తెలియకపోతే మనం దేవుని చిత్తాన్ని నెరవేర్చలేము. మన అవసరాల కోసం ప్రభువా, ప్రభువా అని దేవున్ని పిలిస్తే కుదరదు, నా తండ్రి చిత్త ప్రకారము చెయ్యాలి అని యేసుప్రభువు చెప్పాడు. ముందు తండ్రి చిత్తమేమిటో తెలుసుకోవాలి, దాని ప్రకారము మనం నడుచుకోవాలి, ఆ తర్వాతే మనం దేవునికి మొఱ్ఱపెట్టుకోవాలి. 'కుమారుని చూచి ఆయనయందు విశ్వాసముంచు ప్రతివాడును నిత్యజీవము పొందుటయే నా తండ్రి చిత్తము' (యోహాను 6:40). యేసు ప్రభువునందు విశ్వాసముంచటమే తండ్రి చిత్తము. దేవుని కుమారుడైన యేసుప్రభువునందు విశ్వాసము ఉంచకుండా ఆయన నామమున మనం దేవునికి ప్రార్ధన చేస్తే ఆ ప్రార్ధన అంగీకరింపబడదు. 'విశ్వాసము లేకుండ దేవునికి ఇష్టుడై యుండుట అసాధ్యము' (హెబ్రీ. 11:6). యేసుప్రభువునందు విశ్వాసముంచుట ద్వారా మనం దేవునికి ఇష్టులుగా ఉండగలము. యేసును విశ్వసించి ఆయనను మన హృదయములోనికి ఆహ్వానిస్తే మనం పరిపూర్ణులమవుతాము. ఈ లోకంలో జీవించడానికి మనకోసం మనం ఇంకేమి కోరుకోము. ఒకవేళ మనం ఏదైనా కోరుకుంటే అది మనకి అనుగ్రహింపబడుతుంది. 'నాయందు మీరును, మీయందు నా మాటలును నిలిచియుండిన యెడల మీకేది యిష్టమో అడుగుడి; అది మీకు అనుగ్రహింపబడును' (యోహాను 15:7). అప్పుడు మనం దేని విషయమై చింతించాల్సిన అవసరం రాదు. ఎందుకంటే యేసు మనతో ఉన్నప్పుడు మన అవసరాలన్నీ ఆయనే తీరుస్తాడు. ఒకవేళ మనం దేని విషయమైనా చింతించాల్సి వస్తే మన చింత యావత్తు ఆయనే భరిస్తాడు. తరతరాలుగా యేసులేని క్రిస్మస్ పండుగనే అందరూ జరుపుకుంటున్నారు. అంటే యేసుని నమ్మకుండా, ఆయన యందు విశ్వాసముంచకుండా, ఆయన ఇష్టప్రకారం జీవించ కుండానే ఆయన పుట్టినరోజున క్రిస్మస్ పండుగను అంగరంగ వైభవంగా జరుపుకుంటుంటారు. యేసు మనతో లేకుండా మనం క్రిస్మస్ పండుగ చేసుకుంటే ఆ సంబరం మనకి సంవత్సరంలో ఒక్కరోజే ఉంటుంది. అదే యేసు మనతో, మనలో ఉంటే సంవత్సరంలో ప్రతిరోజూ పండగే. మరి యేసుతో దొరికే సంతోషాన్ని జీవితాంతం పొందటానికి, యేసుతో కలిసి క్రిస్మస్ పండుగ చేసుకోడానికి నేడే యేసుని నీ హృదయంలోకి ఆహ్వానించు. మన ఇంట్లో చిన్నవారు కానీ, పెద్దవారు కానీ, ఎవరైనా పుట్టినరోజు చేసుకుంటే ఆ రోజు వారు బాధపడే పని చెయ్యకుండా వుంటాము. అంతేకాక వారిని సంతోష పెట్టడానికి వారికి ఏది ఇష్టమో అది చేస్తాము కదా! యేసు పుట్టిన రోజు అని క్రిస్మస్ పండుగ రోజు మనము మాత్రమే సంతోషంగా ఉంటే సరిపోదు. దేవున్ని కూడా సంతోషపెట్టాలి కదా! యేసుని సంతోషపెట్టాలి అంటే ఆయన చెప్పినట్లు తండ్రి చిత్తము నెరవేర్చడానికి ఏం చేయాలో ఆలోచించి, అది చేసినప్పుడు యేసు నిజంగా సంతోషిస్తాడు. తండ్రి చిత్తాన్ని ఈ భూమి మీద నెరవేర్చడానికి వచ్చిన యేసుప్రభువునందు విశ్వాసముంచడం ద్వారా దేవుని చిత్తాన్ని నెరవేర్చి ఆయనను సంతోషపెడదాము. అందుకు నీవు సిద్ధమా?

# క్రీస్తు నక్షత్రం

హన్నాకృప పాఠకులకు క్రిస్మస్ శుభాకాంక్షలు.

డిసెంబర్ మాసం రాగానే క్రైస్తవుల గృహములపై ఒక నక్షత్రం కనబడుతుంది. క్రీస్తు ఈ భూమ్మీద పుట్టినప్పుడు జ్ఞానులకు ఆకాశంలో కనపడిన నక్షత్రమునకు గుర్తుగా "స్టార్" క్రిస్మస్ వేడుకల్లో భాగమైంది.

"తూర్పుదిక్కున మేము ఆయన నక్షత్రమును చూచి ఆయనను పూజింప వచ్చితిమి" మత్తయి. 2:2. తూర్పు దేశ జ్ఞానులు ఆ నక్షత్రమును చూచి, అది యుదుల రాజు పుట్టుకను సూచిస్తుందని గ్రహించి ఆయనను వెతుక్కుంటూ బయలుదేరారు. పుట్టింది యూదా రాజు కనుక యూదా దేశపు రాజప్రసాదానికి వెళ్ళి రాజైన హేరోదును కలిసి యూదులరాజుగా పుట్టినవానిని పూజింపవచ్చామని తెలియజేశారు. హేరోదు వారిని బేత్లెహేము పంపగా మరల ఆ నక్షత్రం జ్ఞానులకు కనపడి వారిని క్రీస్తు వద్దకు నడిపించింది. ఇది మనకు తెలిసిన క్రీస్తు నక్షత్రం. ఆ నక్షత్రం నుండి గ్రహించవలసిన పాఠం ఏంటో పరిశీలనగా తెలుసుకుందాం!

ఆకాశంలో కొన్ని కోట్ల నక్షత్రాలు ఉండగా, ఈ నక్షత్రం జ్ఞానుల దృష్టిని ఆకర్షించింది అంటే బహుశా ఆకారంలోను, అది వెదజల్లే కాంతిలోను ప్రత్యేకతను కలిగి ఉంది అనుటలో సందేహం లేదు. అంతేకాక జ్ఞానులకు సరియైన మార్గం చూపి మార్గదర్శకురాలైంది.

క్రీస్తు పిల్లలమైన మనం కూడా క్రీస్తు నక్షత్రంవలె ప్రత్యేకతను కలిగి ఉండాలి. మన వస్త్రధారణ, అలంకరణ (ఆకారం), మాటలు, చేతలు (వెదజల్లే కాంతి) ప్రత్యేకమైనవిగా ఉండాలి. మన నడవడిక లోకమర్యాదను అనుసరింపనిదై ఉండాలి. ఆ ప్రత్యేకత వస్త్రధారణ నుండి మొదలై మాటతీరు, మంచి సాక్ష్యము వరకు కొనసాగాలి. లోకస్తులు అనుసరిస్తున్నట్లు రకరకాల ఫ్యాషన్ దుస్తులు, మేకప్‌లు, అందరి దృష్టిని ఆకర్షించాలనే తపన, అల్లరితో కూడిన సంగీతం, నాట్యం (దేవుని పాటలు అని చలామణిలో ఉన్న సంగీతానికి డి.జేలు, డ్యాన్స్ స్టెప్పులు) ఇవి లోకానుసారమైనవి. ఇవి క్రీస్తు బిడ్డలకు తగదు. క్రీస్తుకు కలిగిన దీనత్వం, మంచితనం ఇవే మనకు కూడా అలంకరణగా, ప్రత్యేకతగా ఉండాలి.

క్రీస్తు నక్షత్రం జ్ఞానులకు దారిని చూపింది. నిజ దేవుని వద్దకు నడిపింది. ఇదే సువార్త. క్రీస్తు బిడ్డలంగా మనం కూడా ఈ లోకంలో జ్ఞానులైనవారితో సహా అందరిని నిజదేవుని వద్దకు నడిపించాల్సిన బాధ్యతను కలిగి ఉన్నాం. నాటి జ్ఞానులు తమ మేథాసంపత్తిని, హేతువాద బుద్ధిని ప్రక్కనపెట్టి సామాన్యునిగా దర్శనమిచ్చిన బాలుడైన క్రీస్తుని యూదులరాజని గ్రహించి పూజించి విలువైన కానుకలు సమర్పించారు. నేటికాలంలో ఇటువంటి జ్ఞానులు కనపడరు సరికదా వారి స్వార్థపూరిత ఉద్దేశాలకు క్రైస్తవ సమాజ ఆచార వ్యవహారాలు తోడయ్యి దేవుని నామానికి అవమానం కలిగిస్తున్నాయి. కావున నేటి క్రైస్తవ్యం హంగు, ఆర్భాటాలతో కాక శాంతియుతంగా స్వీయసాక్ష్యంతో ఆయన నామాన్ని, రక్షణ సువార్తను ప్రచురపరచాలి.

దేవుని బిడ్డలుగా ప్రతి విషయాన్ని తప్పా ఒప్పా అనే కోణంలో కాక, ఈ పని దేవుని దృష్టికి అంగీకారమైనదా? కాదా? నేను చేయు ఈ పని వలన దేవుని నామము ఘనపరచబడుతుందా? అవమానపరచబడుతుందా? అని ఆలోచించి సరియైన నిర్ణయమును తీసుకొనినట్లయితే క్రీస్తు దీనత్వాన్ని ధరించుకొని ఆయన రక్షణ సువార్తను ప్రచురపరిచే నీవే నిజమైన క్రీస్తు నక్షత్రానివి.

***"బుద్ధిమంతులైతే ఆకాశమండలములోని జ్యోతులను పోలినవారై ప్రకాశించెదరు. నీతిమార్గమునను సరించి నడుచుకొనునట్లు ఎవరు అనేకులను త్రిప్పుదురో వారు నక్షత్రము వలె నిరంతరమును ప్రకాశించెదరు " దానియేలు 12:3***

స్త్రీల విభాగం

# యెహోవాయందు భయభక్తులు కలిగిన స్త్రీ

"యెహోవాయందు భయభక్తులు కలిగిన స్త్రీ కొనియాడ బడును" సామెతలు 31:30

లూకా సువార్త మొదటి అధ్యాయం చివరి భాగాలలో గబ్రియేలు దూతతో, మరియ సంభాషణను మనం జాగ్రత్తగా పరిశీలిస్తే "నేను పురుషుని ఎరుగని దానను కదా..." అనుటలో ఆమె దేవునిబట్టి భయము కలిగి తన ప్రవర్తనను కాచుకొనిన స్త్రీగా కనబడుచున్నది. "ప్రభువు దాసురాలను నీ మాట చొప్పున నాకు జరుగును గాక" అనిన పలుకులు దేవుని చిత్తము నెరవేర్చుటకు, పెండ్లి కాకుండా గర్భము ధరించుటకు, దేవుని నిమిత్తం నింద అనుభవించుటకు సమ్మతించుట ఆమె భక్తి జీవితమును గూర్చి సాక్ష్యమిచ్చు చున్నవి. తద్వారా ఆమెకు దేవునిపైగల విశ్వాసం దేవుని చిత్తమును నెరవేర్చుటకుగల దృఢసంకల్పము తెలియజేయ బడుచున్నది. యోసేపు అంగీకారం ఉంటుందని తనకు తెలియదు, యూదుల సమాజం తనను పాపిగా ముద్ర వేస్తుంది, ప్రాణాల పోయే పరిస్థితి అయినప్పటికి దేవుని చిత్తానికి తలవంచి దేవునియందు భయభక్తులు కనపరచి నందున నేటికి మరియ కొనియాడబడుతుంది.

వాక్యము చదివినంతనే అర్థమయ్యే విషయమేమంటే దేవునియందు భయభక్తులు కలిగి ఉండాలి అని. కానీ మనం పరిశీలనాత్మకంగా ఆలోచించి తెలుసుకోవలసిన అతి ప్రాముఖ్యమైన విషయాలు ఏమిటంటే క్రైస్తవ స్త్రీలుగా మనం దేవునియందు భయభక్తులు కలిగియున్నామా? లేకుంటే దేవునియందు భయభక్తులు ఎలా సంపాదించాలి?

క్రమంగా చర్చికి వెళ్ళడం, సంఘ సంబంధిత వ్యవహారా లలో చురుకుగా పాల్గొనటం ఇదే క్రైస్తవ భక్తి కాదు. ఇది కేవలం భక్తి జీవితంలో ఒక భాగం మాత్రమే. వీటితో పాటు అనుదిన వ్యక్తిగత ప్రార్థన జీవితం కలిగి ఉండుట, వాక్య ధ్యానం అలవాటుగా ఉండుట, అనుదినం వాక్యానుసారంగా నడుచుటకు ప్రయత్నించుట అనునవి క్రైస్తవ భక్తి జీవితానికి పునాదులు. అవి లేకుండా ఏమి చేసినా అది వృథా ప్రయాస. తుఫానువంటి క్లిష్టపరిస్థితులు వచ్చినప్పుడు పునాది లేని ఇల్లు రీతిగా మన భక్తి జీవితం కూలిపోతుంది.

దేవుడండే భయము కలిగి జీవించాలి. వారు మాత్రమే దేవునికి వ్యతిరేకమైన పనులు చేయుటకు భయపడతారు. పోతీఫరు భార్య ద్వారా పాపమునకు ప్రేరేపింపబడినప్పుడు కేవలం దేవుడండే తనకున్న భయమే యోసేపును కాపా డింది. అక్కడి నుండి పారిపోయేలా చేసింది. ఎంతటి కష్టానికైనా సిద్ధపడేలా చేసింది. హవ్వ దేవునికి భయపడలేదు అందుకే దేవునికంటే, దేవుని మాటకంటే తన కోరికకు ప్రాధన్యతను ఇచ్చుకుంది. ఫలితంగా శాపాన్ని, పాపాన్ని కొని తెచ్చుకుంది. కాబట్టి దేవునియందు భయము కలిగి జీవించుటకు ప్రయాసపడాలి.

దేవుడంటే భయమును, భక్తిని అనుదిన జీవితంలో అభ్యసించువారు దేవునియందు భయభక్తులు కలిగి కొని యాడబడతారు.

స్త్రీలు క్రైస్తవులైనా, క్రైస్తవేతరులైనా వారు కోరుకునే విషయాలు ఒకేలా ఉంటాయి. స్త్రీలందరూ ఈ లోకంలో జీవించుటకు కావలసినవి అంటే ఉద్యోగం, వ్యాపారం, ఆర్థిక అభివృద్ధి, ఆరోగ్యం, వివాహం, సంతానాభివృద్ధి, ఇవే కోరుకుంటుంటారు. ఇవన్నీ లోకానికి సంబంధించిన అంశాలు. హృదయం నిండా అవే ఉంటే ఇక దేవునికి స్థానమేది? చివరికి దేవుని దగ్గరకు వచ్చినప్పుడు కూడా ఇవే నీ ముఖ్య ప్రార్థనా అంశాలుగా మారడం శోచనీయం. అన్యులవలె నీ ఆలోచనలు ఉంటే క్రైస్తవ స్త్రీగా నీ ప్రత్యేకత ఏది? లోకానికి వేరుగా ఆశించుటకు పురికొల్పవలసిన నీ

భక్తి ఏమైంది? మూర్ఖులగు ఈ తరమువారికి వేరై అని వాక్యము సెలవిస్తున్నది కదా! మరి మానసికంగా నీ ఆలోచనలలో నీవు ఈ లోకానికి వేరుగా ఉన్నావా? లేక అన్యులవలె ఉంటూ క్రైస్తవ స్త్రీగా చలామణి అవుతున్నావా?

లోకానుసారమైన విషయాలపై కాక బిడ్డలను దేవుని యందు భయభక్తులలో పెంచుటకు, కుటుంబాన్ని దేవుని వాక్యపునాది మీద కట్టుటకు, వ్యక్తిగతంగా దేవుని చిత్తమును తెలుసుకొనుటకు, ఇంట్లో, బంధువుల మధ్య సాక్ష్యము కలిగియుండుటకు, వ్యక్తిగత సాక్ష్యము ద్వారా అన్యులకు, పొరుగువారికి సువార్త ప్రకటించుటకు ప్రయాసపడుట, తలాంతులను దేవుని పనికి ఉపయోగించుటకు ప్రయత్నించుట ఇంకా మన అనుదిన ప్రవర్తన సంఘములోను, ఇంట్లోను, పనిచేయు ఆఫీసులోను దేవుని దృష్టికి యోగ్యమైనదిగా ఉన్నదా? లేదా అని నిరంతరం జాగ్రత్త కలిగి వ్యవహరించుట వంటివి ఆలోచిస్తున్నారా?

కేవలం దేవునియందు భయభక్తులు కలిగిన వారు మాత్రమే లోకానుసారమైన జీవితానికి దూరంగా ఉంటూ దేవునికి దగ్గరగా జీవించడానికి అనునిత్యం ప్రయాసపడు తుంటారు. దానికొరకు ఎంత శ్రమనైనను, నిందలనైనను అనుభవించుటకు మరియవలె సిద్ధపడతారు. వారే కొని యాడబడతారు. కానీ నేటి క్రైస్తవ స్త్రీ జాతి ఆ ఊసే మరచి అన్ని విషయాలలో అన్యులతో పోటిపడుతూ, ఖరీదైన వస్త్రధారణ, అలంకరణ, సంబరాలు, లోకానుసారమైన అంశాలకు ప్రాధాన్యత ఇవ్వడం దుఃఖదాయకం.

“లోకమునైనను లోకములో ఉన్నవాటినైనను ప్రేమింపకుడి, ఎవడైనను లోకమును ప్రేమించిన యెడల తండ్రి ప్రేమ వానిలోనుండదు. లోకములో ఉన్నదంతయు, అనగా శరీరాశయు, నేత్రాశయు, జీవపుడంబమును, తండ్రి వలన పుట్టినవికావు; అవి లోకసంబంధమైనవే, లోకమును దాని ఆశ గతించిపోవుచున్నవి గాని దేవుని చిత్తమును జరిగించువాడు నిరంతరమును నిలుచును” 1యోహాను 2:15-17

ఇకనైనా క్రైస్తవ స్త్రీలుగా మనం దేవునియందు భయభక్తులు కలిగి జీవించుటకు ప్రయాసపడదాం!

## చందాదారుల వివరములు

| | | |
|---|---|---|
| డా॥ బి. ప్రజ్వలిత్ రూబేన్, హన్మకొండ | (12-10-24) | 5000 |
| రెవ.డా॥ వి. విజయకుమార్, బొబ్బిలి | (15-01-24) | 5000 |
| మేరిసలోమి, సిరివెళ్ళ, కర్నూలుజిల్లా | (29-11-22) | 5000 |
| రావెల ప్రసాదరావు, గుంతకల్లు | (21-06-24) | 5000 |
| డా॥ క్రిస్టియన్ సిరప్ప, అనంతపూర్ | (06-07-24) | 3000 |
| వై. సంధ్యారాణి, ఒంగోలు | (12-08-23) | 2000 |
| డా॥ సిహెచ్‌కె. సుష్మప్రశాంత్, నెల్లూరు | (22-01-24) | 1500 |
| జయ, గుంటూరు | (6-3-24) | 1500 |
| గంధం డేవిడ్ నీలకాంత్ (నెల్లూరు) | | 1000 |
| జి.మాణిక్యమ్మ అనంతపురం | (25-3-24) | 1000 |
| కె. రజిని, నరసరావుపేట | | 1000 |
| శ్రీమతి రూతు హోసన్న, కావలి | (09-11-24) | 1000 |
| రత్నకుమారి, మచిలీపట్నం | (10-9-24) | 700 |
| వి. కస్తూరి, భీమవరం | | 500 |
| బి. పరంజ్యోతి, హైదరాబాద్ | (11-12-23) | 500 |
| శాంతాగ్రేస్, మచిలీపట్నం | (6-1-23) | 500 |
| పి.వి.రెడ్డి, ఒంగోలు | | 500 |
| బి. నెహెమ్యా, చిన్నగంజాం | (24-11-23) | 500 |
| కె. నైటింగేల్, నెల్లూరు | (11-11-23) | 500 |
| మారనాత బైబిల్ సెమినరీ, విజయవాడ | (24-11-23) | 500 |
| డి. శ్యామ్‌సిన్హా, బాపట్ల | (13-12-23) | 500 |
| ఆర్. దేవికుమారి, పర్చూరు | (20-5-24) | 500 |
| యం. విల్సన్, నెల్లూరు | (14-09-24) | 500 |
| జి. జార్జిథామస్, దుగ్గిరాల | (14-02-24) | 500 |
| కె. ఆదిలక్ష్మి, డిస్ట్రిక్ట్ లైబ్రరి, ఒంగోలు | (24-09-24) | 500 |
| కె. కమల్, మంచిర్యాల, తెలంగాణ | (14-10-24) | 500 |
| కె. ఐజక్‌సుకుమార్, ఒంగోలు | (14-8-24) | 500 |
| బి. జయరావు, బుచ్చిరెడ్డిపాలెం | (6-11-24) | 500 |
| జి. కళావతి, ఒంగోలు | | 350 |
| కె. కల్పన, గోవా | | 350 |
| జి. వెంకటేశ్వర్లు, కొత్తపల్లి | | 350 |
| సి.హెచ్.స్వయంప్రభ, చిలకలూరిపేట | (18-3-24) | 350 |
| కె. రాజేష్, రాజమండ్రి | | 350 |
| యస్. గోపి, పార్వతిపురం | (7-1-24) | 350 |
| శ్రీమతి సరోజిని | | 350 |
| టి. క్రిస్టియానమ్మ, నందికొట్కూరు | (12-9-24) | 350 |
| టి.యం. భగవాన్‌దాస్, కదిరి | (7-3-24) | 350 |
| కె. విజయకుమార్, ఒంగోలు | (1-3-24) | 350 |
| జె. రాజేష్, ఒంగోలు | (6-7-24) | 350 |
| కె. ఉదయకుమారి, కాకుమాను | (2-8-24) | 350 |
| కె. రాబర్ట్ ప్రభాకర్, ఉదయగిరి | (3-10-24) | 350 |
| వై. జోసఫ్, భీమవరం | (4-10-24) | 350 |
| జి. క్యాథరిన్, ఒంగోలు | (8-10-24) | 350 |
| వి. రత్నమ్మ, హైదరాబాద్ | (17-10-24) | 350 |
| కె. రాయప్ప, పెదవడ్లమూడి | (5-8-23) | 350 |
| బి. రవికుమార్, హైదరాబాద్ | 20-11-24 | 350 |
| పి. దేవదానం, గుంటూరు | (24-2-24) | 300 |
| పి. యేసుబాబు లోకేష్, చింతలపూడి | (17-1-24) | 200 |
| ఆర్. ఇన్నయ్య, గుంతకల్ | | 200 |

చిన్నపిల్లల పేజి

# క్రిస్మస్

అమ్మతో క్రిస్మస్ షాపింగ్‌కి వెళ్ళిన లీనాకు షాప్‌లోని బొమ్మ (మానెకిన్)కు వేసి ఉన్న లావెండర్ షేడ్‌లోని డ్రస్ చాలా నచ్చింది ఎన్ని డ్రస్‌లు చూసినా, లీనాకు ఆ డ్రస్సే నచ్చింది. ఆ డ్రస్‌కు పరఫెక్ట్ మ్యాచింగ్ బ్రాస్‌లెట్, నెక్‌లెస్ కూడా ఇవ్వబడ్డాయి. లీనా ధ్యాసంతా ఆ బొమ్మకు వేసిన డ్రస్ మీద ఉన్నదని గ్రహించిన తల్లి ఆ డ్రస్ నచ్చిందా అని అడిగింది. ఆమె అలా అడగడమే తడవు అవును అని చెప్పిన లీనా ముఖం సంతోషంతో వెలిగిపోయింది.

బొమ్మకు వేసిన డ్రస్‌ను తీసుకొని ట్రైల్ రూమ్‌కు వెళ్ళిన లీనా ఆ డ్రస్ వేసుకొని అద్దంలో చూసుకొని మురిసి పోయింది. కానీ లీనాకు ఆ డ్రస్ పెద్దదైంది. నడవడానికి కాస్త అసౌకర్యంగా ఉంది. అంతకంటే చిన్న సైజులో ఉన్న అటువంటి డ్రస్‌లు అయిపోయాయని షాపువాడు చెప్పడంతో లీనా సంతోషం ఆవిరైంది.

తనకు సరిపోయే సైజ్‌లో లావెండర్ కలర్ డ్రస్ దొరకాలని మనసులో ప్రార్థించుకుంటూ షాపులన్నీ తిరిగింది లీనా. కానీ ఫలితం లేకపోయింది. ఆ డ్రస్ దొరకక పోవడంతో నిరాశ చెందిన లీనా చివరికి తల్లి బలవంతం మీద వేరే డ్రస్ తీసుకోవడానికి అంగీకరించింది ఒక షరతుతో. అదేమంటే డ్రస్‌తో పాటు దానికి మ్యాచింగ్ బ్రాస్‌లెట్, నెక్‌లెస్ కొనివ్వాలని. సరే అన్నది తల్లి. అతి కష్టం మీద లీనాకు ఒక రెడ్ కలర్ డ్రస్ నచ్చింది. ఆ డ్రస్ మీద మ్యాచింగ్ బ్రాస్‌లెట్, నెక్‌లెస్ కూడా కొన్నది తల్లి. లీనాకు ఆ రెడ్ డ్రస్ కంటే దాని కొరకు కొన్న బ్రాస్‌లెట్ బాగా నచ్చింది. మధ్య మధ్యలో తెలుపు రంగు రాళ్ళతో చాలా ఆకర్షణీయంగా ఉంది ఆ బ్రాస్‌లెట్. ఎప్పుడెప్పుడు దానిని ధరించాలా అని లీనా క్రిస్మస్ కొరకు ఎదురు చూస్తున్నది.

సండేస్కూల్ ఈవెంట్స్ అన్నింటిలో చురుకుగా పాల్గొంటుంది లీనా. సండేస్కూల్‌లో ఈ రోజు ఏమి చెప్పారు? అని అడిగింది తల్లి. మనం ఏది అడిగినను దేవుడిస్తాడు అని చెప్పారు అన్నది లీనా. ఏదైనా కాదు, ఏది అవసరమో అది దేవుడు ఇస్తాడు. కాబట్టి మనం దేవున్ని బట్టి సంతోషించాలి అన్నది తల్లి. తల్లి ఏమి చెప్పిందో లీనాకు అర్థం కాలేదు

తన ఇంటికి వచ్చిన మేఘనను చూసి సంతోషించింది లీనా. మేఘన లీనా మంచి స్నేహితులు. లీనా సంతోషంగా తన క్రిస్మస్ డ్రస్, దాని ఆభరణాలను మేఘనకు చూపించింది. మేఘనకు లీనా బ్రాస్‌లెట్ నచ్చేసింది. లీనా మొదట సంతోషించింది కానీ, మేఘన కూడా క్రిస్మస్‌కు ఒక సిల్వర్, రెడ్ కలర్ డ్రస్ తీసుకున్నాను అని ఆ డ్రస్‌కు ఈ బ్రాస్‌లెట్ సరిగ్గా మ్యాచ్ అవుతుందని చెప్పడం లీనాకు నచ్చలేదు. సరిగ్గా అదే సమయంలో స్నాక్స్ తీసుకొని అక్కడికి వచ్చిన లీనా తల్లి జోక్యం చేసుకుంటూ అంతగా నచ్చితే తీసుకో మేఘన, లీనాకు మరొకటి కొనిస్తాలే అన్నది. ఇంతలో మేఘన తల్లి ఆమెను త్వరగా రమ్మనడంతో మేఘన సంతోషంగా బ్రాస్‌లెట్‌ను లీనా చేతిలోనుండి లాక్కుని థ్యాంక్స్ ఆంటీ అని చెప్పి వెళ్ళిపోయింది స్నాక్స్ తినకుండానే.

మరునాడే క్రిస్మస్ ఇప్పటికిప్పుడు నాకు బ్రాస్‌లెట్ ఎక్కడనుండి తెస్తావు? అసలు నాకు డ్రస్ కంటే బ్రాస్‌లెటే బాగా నచ్చింది. నువ్వేమో దానిని మేఘనకు ఇచ్చేశావు అన్నది లీనా నీళ్ళు నిండిన కళ్ళతో. నేను మేఘన డ్రస్ ఫోటో చూశాను. నిజంగానే నీ డ్రస్ కంటే మేఘన డ్రస్‌కి అది పర్‌ఫెక్ట్ మ్యాచ్. అందుకే తనను తీసుకోమన్నాను. అయినా మేఘన నీ బెస్ట్‌ఫ్రెండ్ అంటావ్ కదా ఆమె కోసం చిన్న బ్రాస్‌లెట్‌ను వదులుకోలేవా అన్నది తల్లి లీనా కళ్ళు తుడుస్తూ. తల్లి మాటలు కాస్త అంగీకరించదగినవే అనిపించినా లీనా కోపం పూర్తిగా చల్లారలేదు. స్నాక్స్ కూడ తినకుండా అలిగి తన రూమ్‌లోనే కూర్చుంది. క్రొత్త బ్రాస్‌లెట్ కొనడానికి షాపింగ్‌కి వెళ్దామని పిలిచిన వెళ్ళలేదు లీనా.

క్రిస్మస్ అంటే క్రీస్తును ఆరాధించడం అని అర్థం. మనం ఆభరణాలు, దుస్తులు వంటి వస్తువులనుబట్టి కాక మనకు అవసరమైనవన్నీ సకాలం ఇచ్చే మన దేవున్నిబట్టి సంతోషించాలి. అదే నిజమైన ఆరాధన అన్న తల్లిమాటలు గుర్తుకొచ్చి తన కోపాన్ని ప్రక్కనపెట్టి మంచం మీద నుండి లేచి డైనింగ్ టేబుల్ వద్దకు వచ్చింది. టేబుల్ మీద ఉన్న గిఫ్ట్‌బాక్స్‌ను చూసి, ఎవరిది ఈ గిఫ్టు? అని తల్లిని అడిగింది లీనా. ఈ క్రిస్మస్ గిఫ్ట్ తీసుకొనే కదా మేఘన వచ్చింది అన్నది తల్లి. లీనా అనాసక్తిగానే గిఫ్ట్ ప్యాక్ తెరచింది. లీనా సంతోషానికి హద్దులు లేవు. అది లీనా ఇష్టపడిన లావెండర్ షేడ్ డ్రస్. అందులోను అది కరెక్ట్‌గా లీనా సైజ్. లీనా తన కళ్ళను తానే నమ్మలేకపోయింది. లీనా జీవితంలో అది బెస్ట్ క్రిస్మస్‌గా నిలిచిపోయింది.

దేవున్ని హృదయపూర్వకంగా ఆరాధించడమే నిజమైన క్రిస్మస్ అని, అప్పుడు దేవుడు అవసరమైనవన్నీ అనుగ్రహిస్తాడని గ్రహించింది లీనా.

“కాగా దేవుడు తన ఐశ్వర్యము చొప్పున క్రీస్తుయేసునందు మహిమలో మీ ప్రతి అవసరమును తీర్చును” (ఫిలిప్పీ. 4:19).

**బైబిల్ క్విజ్-11 జవాబులు పంపినవారు :**

1. ఆనీమేరి, హైదరాబాద్, 2. క్రిస్టియానమ్మ-నందికొట్కూరు, 3. స్వప్నిక-మార్కాపురం, 4. సబిత-కాకినాడ, 5. వి.రత్నమ్మ-హైదరాబాద్, 6. రాజేష్-కడప. 7. ప్రియాంక-విజయవాడ.

**దయచేసి పత్రిక కొరకు మీరు పంపించే చందా మనియార్డర్ ద్వారా పంపదలుచుకుంటే ఈ క్రింద అడ్రసుకు పంపగలరు.**

**కె. ఇమ్మానియేల్ రాజేంద్ర,**
**ఎడిటర్, హన్నాకృప ఆధ్యాత్మిక మాసపత్రిక**
**6వ లైను, క్లౌపేట, ఒంగోలు-523001**
**ప్రకాశం జిల్లా, ఫోన్: 9440217726**



## సండేస్కూల్/వి.బి.యస్ బుక్స్ & గేమ్స్

| | |
|---|---|
| సండేస్కూల్ యాక్టివిటి బుక్-1 | రూ. 50/- |
| సండేస్కూల్ యాక్టివిటి బుక్-2 | రూ. 50/- |
| సండేస్కూల్ యాక్టివిటి బుక్-3 | రూ. 50/- |
| సండేస్కూల్ యాక్టివిటి బుక్-4 | రూ. 50/- |
| సండేస్కూల్ కలరింగ్ బుక్-1 | రూ. 50/- |
| సండేస్కూల్ కలరింగ్ బుక్-2 | రూ. 35/- |
| సండేస్కూల్ కలరింగ్ బుక్-3 | రూ. 70/- |
| సండేస్కూల్ కలరింగ్ బుక్-4 | రూ. 70/- |
| సండేస్కూల్ బైబిల్ స్టోరీస్ బుక్-1 | రూ. 50/- |
| సండేస్కూల్ బైబిల్ స్టోరీస్ బుక్-2 | రూ. 50/- |
| సండేస్కూల్ బైబిల్ స్టోరీస్ బుక్-3 | రూ. 50/- |
| మార్గము-వి.బి.యస్. మెటీరియల్ | రూ. 35/- |
| ఆత్మఫలము-వి.బి.యస్. మెటీరియల్ | రూ. 35/- |
| బైబిల్‌బాలలు-వి.బి.యస్. మెటీరియల్ | రూ. 35/- |
| ధన్యతలు-వి.బి.యస్. మెటీరియల్ | రూ. 50/- |
| విధేయత యాక్టివిటీ బుక్ | రూ. 50/- |
| దేవునియందలి భయభక్తులు యాక్టివిటీ బుక్ | రూ. 50/- |
| బిగినర్స్ యాక్టివిటి బుక్ (ఒ.టి.) | రూ. 25/- |
| బిగినర్స్ యాక్టివిటి బుక్ (యన్.టి.) | రూ. 25/- |
| సండేస్కూల్ సాంగ్స్ బుక్ | రూ. 100/- |
| సండేస్కూల్ డైరి | రూ. 75/- |
| సండేస్కూల్ మోరల్ స్టోరీస్ బుక్-1 | రూ. 35/- |
| సండేస్కూల్ మోరల్ స్టోరీస్ బుక్-2 | రూ. 50/- |
| సండేస్కూల్ మోరల్ స్టోరీస్ బుక్-3 | రూ. 75/- |
| సండేస్కూల్ టీచర్స్ గైడ్ | రూ. 60/- |
| సంఘకాపరి-సండేస్కూల్ | రూ. 50/- |
| సండేస్కూల్ స్కిట్స్ | రూ. 50/- |
| సండేస్కూల్ మెమోరి వర్సెస్ బుక్ | రూ. 15/- |
| సండేస్కూల్ స్టిక్కర్స్ (32 ప్యాక్) | రూ. 160/- |
| బైబిల్ ఇండెక్స్ గేమ్ | రూ. 350/- |
| బైబిల్ ఫ్యామిలి నేమ్స్ గేమ్ | రూ. 350/- |
| బైబిల్ నేమ్స్ గేమ్ | రూ. 450/- |
| బైబిల్ వర్సెస్ స్టార్ గేమ్ | రూ. 400/- |
| బైబిల్ నేమ్స్ ప్రిడిక్షన్ గేమ్ | రూ. 150/- |
| బైబిల్ క్విజ్ గేమ్ | రూ. 400/- |
| యానిమల్స్ అండ్ బర్డ్స్ ఇన్ బైబిల్ గేమ్ | రూ. 400/- |
| హెవెన్ అండ్ హెల్ మెమోరి వర్సెస్ గేమ్ | రూ. 550/- |

**బైబిల్ లిటరేచర్ మినిస్ట్రీ**
ఫోన్ : 9440217726



# బైబిల్ క్విజ్-12



## 2సమూ. 9-24 - 1రాజులు.1-9

1. సౌలు కుటుంబ సేవకుని పేరేమి? (2సమూ. 9అ)
2. హానూను తండ్రి పేరు ఏమిటి? (10అ)
3. ఏ కాలంలో రాజులు యుద్ధమునకు బయలుదేరుదురు? (11అ)
4. సొలొమోనుకు నాతాను ప్రవక్త పెట్టిన పేరేమిటి?(12అ)
5. అబ్షాలోము సహోదరి పేరు ఏమిటి? (13అ)
6. యుక్తిగల స్త్రీని యోవాబు ఎక్కడ నుండి పిలిపించెను? (14అ)
7. దావీదు అబ్షాలోముకు భయపడి తన యింటి వారిని తీసుకొని పారిపోయి ఎక్కడ బస చేసెను? (15 అ)
8. నరహంతకుడా, దుర్మార్గుడా, ఛీ పో, ఛీ పో అని దావీదును దూషించినది ఎవరు? (16 అ)
9. తాను చెప్పిన ఆలోచన జరగకపోవుట చూచి ఉరి పోసికొని చనిపోయినది ఎవరు? (17 అ)
10. అబ్షాలోమును చంపినది ఎవరు? (18 అ)
11. బర్జిల్లయి వయస్సు ఎంత? (19 అ)
12. బిక్రి కుమారుని పేరు ఏమిటి?(20 అ)
13. ఎవరినిబట్టి దావీదు కాలములో 3 సం॥లు కరువు కలిగెను? (21 అ)
14. "దయగలవారి యెడల నీవు దయ చూపించెదవు" రెఫరెన్సు ఏమిటి? (22 అ)
15. బావిలో దాగియున్న సింహమును చంపిన దావీదు అనుచరులలో ముఖ్యుడు ఎవరు? (23 అ)
16. జనసంఖ్య చూచినందుకై దావీదు యొద్దకు పంపబడిన దీర్ఘదర్శి పేరేమిటి? (24 అ)
17. దావీదుకు పరిచర్య చేయుటకు తీసుకు రాబడిన చిన్నదాని పేరు ఏమిటి? (1రాజులు 1అ)
18. దావీదు ఇశ్రాయేలీయులను ఏలిన కాలమెంత? (2అ)
19. సొలొమోను యెహోవాను ఏమి కోరెను? (3అ)
20. సొలొమోను కుమార్తె పేరు ఏమిటి? (4అ)
21. సొలొమోను హీరాముకు ఎన్ని గోధుమలు ఇచ్చెను? (5అ)
22. సొలొమోను మందిరమును ఎన్ని సం॥లు కట్టించెను? (6అ)
23. సొలొమోను తన నగరును ఎన్ని సం॥లు కట్టించెను? (7అ)
24. మందసమును ఎక్కడ నుండి తీసుకొని వచ్చిరి?(8అ)
25. హీరాము సొలొమోనుకు ఎంత బంగారము ఇచ్చెను? (9అ)

### బైబిల్ క్విజ్ - 11 జవాబులు

1. 10,000 మంది (1సమూ. 15:4) 2. ఏలీయాబు (16:6) 3. సింహము, ఎలుగుబంటి (17:34) 4. దావీదు (1సమూ. 18:1) 5. రామాలోని సమూయేలు నొద్దకు (19:18) 6. ఏసెలు అను బండ దగ్గర (20:19) 7. అహీమెలెకు (21:1) 8. దోయేగు (22:18) 9. జీఫు అరణ్యమున ఒక పర్వతమందు (23:14) 10. సౌలు యెహోవాచేత అభిషేకము నొందినందున (24:6) 11. రామాలోని అతని ఇంటి నివేశనములో (25:1) 12. 3000 మందితో (1సమూ. 26:2) 13. మాయోకు (27:2) 14. ఏన్దోరులో (28:7) 15. ఫిలిష్తీయుల సర్దారులు అభ్యంతరమువలన (29:4) 16. అమాలేకీయులు (30:1) 17. యోనాతాను, అబీనాదాబు, మెల్కీషూవ (31:2) 18. యాషారు గ్రంథములో (2 సమూయేలు 1:17-18) 19. 7సం॥ల 6నెలలు (2:11) 20. హగ్గీతు (3:4) 21. మెఫీబోషెతు (4:4) 22. హీరాము (5:11) 23. గిబియాలోని అబీనాదాబు ఇంట నుండి (6:4) 24. నాతాను (7:1) 25. హదదెజరు (8:3)